
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 01.07.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## అవమానాలను దిగమింగి...

# అమరావతి వైపు అడుగులు!



- హైదరాబాదుకు సెలవు... ఇక అమరావతిలో కొలువు
- నవ్యాంధ్ర రాజధానికి కొత్త కళ... తాత్కాలిక భవనాలలోనే విధులు

**ఆరు దశాబ్దాలుగా హైదరాబాదుతో వున్న బంధాన్ని, సహఉద్యోగులతో ఉన్న అనుబంధాన్ని తెంపుకుని, కొన్నేళ్లుగా జరిగిన అవమానాలను గుండెల్లో దాచుకుని, మూటాముల్లె సర్దుకుని ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, ఇతర శాఖల ఉద్యోగులంతా అమరావతికి వచ్చి కొలువుదీరారు. దీంతో అమరావతి రాజధాని ప్రక్రియలో తొలి అడుగు పడినట్లయ్యింది. ఇష్టంగా కొందరు, అయిష్టంగా మరికొందరు... ఉద్యోగులు అమరావతి బాట పట్టక తప్పలేదు.**

జూలై నెలకల్లా అమరావతి రాజధాని నుండే ఏపి పరిపాలనా వ్యవహారాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రయత్నం చాలావరకు సఫలమైనట్లే! అన్నీ వసతులున్న హైదరాబాద్‌ను వదిలేసి ఉద్యోగులందరు కూడా అమరావతికి రావడం శుభపరిణామమే!

రాష్ట్ర రాజధాని విషయంలో 'ఓటు-నోటు' కేసు కీలకమలుపు తిప్పింది. తెలంగాణలో చోటుచేసుకున్న 'ఓటు-నోటు' వ్యవహారంతో చంద్రబాబు హైదరాబాదులో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. లేకుంటే ఆయన అంత సామాన్యంగా హైదరాబాద్‌ను వదిలిపెట్టి రాడు. ఉమ్మడి రాజధాని పదేళ్ల కాబట్టి సీఎంగా ఉన్నంతకాలం అక్కడే కాలం వెళ్ల బుచ్చేవాడు. ఓటు-నోటు కేసు పెద్ద షాక్ కాగా, ఆ తర్వాత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కూడా తెలంగాణలో తెలుగు దేశం భవిష్యత్‌ను స్పష్టం చేశాయి. ఈ రెండు సంఘటనలతో చంద్రబాబుకు హైదరాబాద్ మీద పూర్తిగా ప్రేమ, అభిమానం

(మిగతా 11వ పేజీలో)

# నెల్లూరులో చైనా కర్మాగారం



- చంద్రబాబు పర్యటన ఫలితం

ఏపిలో పారిశ్రామికాభివృద్ధికి అనువైన వేదిక నెల్లూరుజిల్లానే! కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ సెజ్‌లు పరిశ్రమల మణిహారాలుగా వర్ధిల్లు తున్నాయి. అందుకే విదేశాలు సైతం నెల్లూరు వైపు చూస్తున్నాయి.

(మిగతా 11వ పేజీలో)

VPR ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 5న నెల్లూరులో...

3లో

# ఆధ్యాత్మిక సదస్సు



శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామి రాక




# వీధికెక్కిన న్యాయం



## వీళ్ళు అ'న్యాయమూర్తులు'


**కంచె చేను మేస్తే... న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయమూర్తులే అన్యాయానికి దిగితే... సామాన్యులను రక్షించేదెవరు? న్యాయాన్ని కాపాడేదెవరు? అన్యాయాన్ని ప్రశ్నించేదెవరు?**

రాష్ట్ర విభజన జరిగాక ఆస్థులు తెలంగాణకు, అప్పులు ఆంధ్రకు మిగిలాయి. ఉమ్మడి ఆస్తులను 58-42 నిష్పత్తిలో పంచుకోవాలని సుప్రీం కోర్టు సూచించినా, ఆ విధంగా పంపకాలు జరిగిన దాఖలాలు లేవు. ఆస్తుల పరంగా ఏపి ఎంతో నష్టపోయింది. గత యూపిఏ హయాంలో ఆంధ్రప్రదేశ్‌కు సోనియాగాంధీ చేసిందే అన్యాయమనుకుంటే ఇప్పుడు కేసీఆర్ అంతకంటే దారుణంగా వ్యవహరిస్తున్నాడు. చంద్రబాబు బలహీనతను ఆసరాగా చేసుకుని స్థానిక బిర్రుతో హైదరాబాద్‌పై పదేళ్లు హక్కు వున్నా రెండేళ్లకే మన పరిపాలనా యంత్రాంగాన్నంతా అక్కడ నుండి తరిమేసాడు. దాదాపు అన్ని శాఖలు కూడా అమరావతి బాట పట్టాయి.

కాకపోతే హైకోర్టు విభజనే ఇంకా తెమలలేదు. హైకోర్టు విభజన అంశం సుప్రీంకోర్టు పరిధిలో వుంది. కేసీఆర్ ఇక్కడ కూడా పొగపెట్టాడు. తెలంగాణ న్యాయమూర్తులను, న్యాయవాదులను రెచ్చగొట్టాడు. ఆంధ్రా న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇక్కడ నుండి వెళ్లిపోవాలంటూ వాళ్లు రోడ్లెక్కి ధర్నాలు, ఆందోళనలకు దిగారు. న్యాయవాదుల కంటే ఒక పద్ధతి పాడు లేదు.

(మిగతా 11వ పేజీలో)

# నేత్రపర్వంగా వెంగమాంబ తిరునాళ్ళు



నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో వేంచేసియున్న భక్తుల కొంగు బంగారం వెంగమాంబ తల్లి ఆలయ బ్రహ్మోత్సవాలు 30వ తేదీతో వైభవంగా ముగిసాయి. బుధవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన వెంగమాంబ గురవయ్యనాయుడుల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. మేళతాళాలతో మంగళవాయిద్యాల నడుమ దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను, ముత్యాల తలంబ్రాలను ప్రధాన ఆలయం నుంచి ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదిక వద్దకు ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు దంపతులు వెంగమాంబ, గురవయ్యనాయుడులకు పట్టువస్త్రాలను సమర్పించారు. పచ్చవ, తుమ్మల, వేమూరి వంశస్థులు ఈ కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి పుట్టినిల్లు అయిన వడ్డిపాలెం నుంచి పసుపు, కుంకుమలను ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. పచ్చవ చినవెంగయ్య కుటుంబసభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహంతో దేవస్థాన ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కావలి డిఎస్పీ రాఘవరావు ఆధ్వర్యంలో ఉదయగిరి సిఐ శ్రీనివాసరావు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారాంపురం ఎస్సైలు సైదులు, విజయకుమార్, జిలానీలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంగమాంబ సేవాసమాజం, సాయిబాబా మందిరం, వెంగమాంబ భక్తమండలి, ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వెంగమాంబ పేరంటాలు ప్రధానోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి పుట్టినిల్లు వడ్డిపాలెం నుంచి ప్రదానోత్సవం ప్రారంభమై నర్రవాడ వీధుల నుండి సాగింది. గురువారం బండ్లు గుడి చుట్టూ తిరగడం, పొంగళ్లు, బండలాగుడు పందేలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు.

పట్టువస్త్రాలు, తలంబ్రాలు ఊరేగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు పేలపూడి వెంకటరత్నం, గంగవరపు సుబ్బారావు, పచ్చవ వెంగయ్య, ధనాల తిరుపతయ్య, పులివర్తి సునీత, సవరం వెంగయ్య, గూడూరు రామచంద్రారెడ్డి, మాజీ ఆలయ చైర్మెన్ తుమ్మల సురేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకపాటి మాలకొండ్రాయుడు, మేకపాటి మాల్యాద్రి, ధర్మకర్త మునలయ్య, ఎంపిపి శ్రీకుర్తి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ నగర్‌ను పట్టించుకోండి

## - ఎమ్మెల్యే అనిల్



నెల్లూరు నగరంలోని కొత్తూరు సమీపంలో ఉన్న వైయస్సార్ నగర్‌ను నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ హౌసింగ్ అధికారులతో కలిసి జూన్ 27వ తేదీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రతి పేదవానికి ఇల్లు ఉండాలనే సంకల్పంతో ఆనాడు నెల్లూరు నగరంలో అద్దె ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు 6500 ఇళ్లను మంజూరు చేశారని, ఆయన హయాంలో శరవేగంగా పనులు జరిగాయని, అయితే ఆ మహానేత మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఇళ్లను పూర్తిగా నిర్మించడంలో విఫలమయ్యారన్నారు. తక్షణమే 20కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే 6500 కుటుంబాలకు నివాసాలు కల్పించినవారవుతారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇస్తుందని గొప్పలు చెప్పుకుంటోందని, మంత్రి నారాయణ ఇప్పటికే పలుమార్లు ఈ ప్రాంతానికి వచ్చి వెళ్లారే తప్ప ఇప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదన్నారు. జిల్లా మంత్రి ఈ రెండు సంవత్సరాల్లో జిల్లాకు చేసిందేమీ లేదు కాబట్టి, ఇప్పటికైనా మంత్రి నారాయణ స్పందించి 20కోట్లు మంజూరు చేయించి ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్, వందవాసి రంగా, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కూకాటి ప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జి.పి.శ్రావణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సత్యకృష్ణ, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# ఇద్దరు ఎస్‌ఐలకు వీడ్కోలు

నెల్లూరు స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్‌ఐలుగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి జూన్ 30న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా, 25వ తేదీన ఎస్‌బి కార్యాలయంలో వారికి ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఎస్‌బి డిఎస్పీలు కోటారెడ్డి, విక్రమ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మాణిక్యరావు వారిరువురినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఎస్‌ఐలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు



నెల్లూరుజిల్లా ముస్లిం యూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు కోటమిట్టలోని షాదీ మంజిల్‌లో ఉన్న ఎంపిపిఎస్ తెలుగు పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా కమిటి అధ్యక్షుడు ఖాలీద్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్న, అబుజర్, అల్తాఫ్, కరిముల్లా, సోహెల్, ఎజాస్, ఇసాక్, శరద్‌పవార్ పాల్గొన్నారు.

# వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

నెల్లూరుజిల్లా చిలమానుచేను బిసి వసతిగృహ వార్డెన్ ఆనీఫ్‌పై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షులు అరవ పూర్ణప్రకాష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ వెంటనే స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

# ప్రతిభకు ప్రాధాన్యతతోనే ప్రగతి

ప్రతిభను గుర్తించిన చోటే ప్రగతికి ఆస్కారముంటుందని కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. జూన్ 24వ తేదీన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. వెంకయ్య కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ గత కొన్నేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ఓ ప్రతిభా పండుగలా నిర్వహిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రభుత్వాలు సైతం అంతగా పట్టించుకోని కాలంలో దీపా వెంకట్ జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులను గుర్తించి సత్కరిస్తుండడం ప్రశంసనీయం. ఈ ప్రతిభాపురస్కారోత్సవానికి అధ్యక్షత వహించిన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధ్యమేనన్నారు. చదువుకున్నోళ్లంతా ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకుంటే కుదరదని, ఉద్యోగ మొక్కటే జీవితం కాదని, మనం కష్టపడితే ఇతర రంగాలలోనూ అద్భుతాలు సాధించవచ్చన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకురావాల్సి వుందని, కేంద్రప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ముఖ్య అతిథులుగా పాల్గొన్న కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పియూష్‌గోయల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌లు తమ ప్రసంగాలలో స్వర్ణభారత్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను, ట్రస్టును ముందుండి నడిపిస్తున్న దీపావెంకట్‌ను అభినందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఇంతపెద్ద ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్య, ఉపాధి రంగాలలో ఎంతో మందికి శిక్షణ నిస్తుండడాన్ని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.జానకి, ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మెన్ యం.హర్షవర్ధన్, వెంకయ్య సతీమణి ఉషమ్మ, జిఎంఆర్ గ్రూప్ బిజినెస్ చీఫ్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే నటజీవితం

## ప్రముఖ సినీనటుడు చలపతిరావు

మహానటుడు ఎన్టీరామారావు స్ఫూర్తితోనే తాను నటజీవితం ప్రారంభించానని, ఎన్టీఆర్ తనకు కథానాయకుడు చిత్రంలో అవకాశం కల్పించారని, ఆ తర్వాత తనకు అనేకచిత్రాల్లో నటించేందుకు అవకాశం కలిగిందని, దాదాపు 13 వందల చిత్రాలకు పైగానే తాను నటించానని ప్రముఖ సినీనటుడు చలపతిరావు అన్నారు. గత నెల 25న ఆయన జలదంకి మండలంలోని బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్సీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్‌తో కలసి తాను 98చిత్రాల్లో నటించడం తన అదృష్టమన్నారు. విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమవుతుందని, పాఠశాల విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, తాను చిన్నప్పుడు చదువుకున్న ఈ పాఠశాల అభివృద్ధికి ఏటా 2 లక్షల రూపాయలు వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నటుడు చలపతిరావుకు అక్షర పురస్కారం జ్ఞాపికను బహూకరించారు. అనంతరం స్కూల్లో మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ట్రస్ట్ ఛైర్మెన్ మోహన్, జి.మాల్యాద్రినాయుడు, వంటేరు జయచంద్రారెడ్డి, డాక్టర్ దశరథరామిరెడ్డి, మాలకొండారెడ్డి, అన్నదాత మణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కొండబిట్రగుంటకు వెళ్ళి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

# విద్యార్థులకు చైతన్యజ్యోతి విద్యాసామాగ్రి



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కొలిమిట్టపాళెం ప్రాథమిక పాఠశాలలో జూన్25న చైతన్యజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో సేవ్ ద చిల్డ్రన్ సహకారంతో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి ఇవ్వడం ద్వారా బడిబైట పిల్లలు కూడా బడికి వెళ్ళేందుకు ఉత్సాహపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, చైతన్య జ్యోతి సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ మస్తానయ్య, సంస్థ సభ్యులు టి.శ్రీలత, పి.లక్ష్మి, మస్తాన్, గ్రామపెద్దలు ఈశ్వరయ్య, చిననర్సింహులు, సుధాకర్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

# ఆదిశంకర విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

నెల్లూరుజిల్లా గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ప్రియాంక షార్ జాతీయ సదస్సులో ప్రతిభా పురస్కారం అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రియాంక షార్‌లో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్ లెమ్‌సిస్-2016లో బెస్ట్ పోస్టర్ అవార్డును సాధించిందన్నారు. తమ కళాశాల అటానమస్ కలిగివున్నందున విద్యార్థుల విజ్ఞాన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకునే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణ, హెచ్‌వోడి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# భగవత్ రామానుజాచార్యుల వారి సహస్రాబ్ది సందర్భంగా జూలై 5న నెల్లూరులో.. ఆధ్యాత్మిక సదస్సు

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
చిన్న జియ్యర్‌స్వామి వారిచే
శ్రీ భగవద్రామానుజుల
సహస్రాబ్ది సందేశం



*దాదాపు వెయ్యేళ్ళ క్రితమే సమాజాన్ని ఆధ్యాత్మిక తత్వంతో ఎంతగానో ప్రభావితం చేసి, లోకమంతా సమతా మమతలు వెల్లివిరియాలని సమసమాజ స్థాపనకు కృషిచేసి..జగతికి వెలుగుబాటలు పరచిన మహా సంఘసంస్కర్త.. సమతామూర్తి భగవద్రామానుజాచార్యులవారి సహస్రాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రముఖ దాత.. ఆధ్యాత్మికవేత్త శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నేతృత్వంలో పెద్దఎత్తున ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరమహంస పరివ్రాజకులు.. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామి వారి మంగళాశాసనాలతో ప్రారంభమయ్యే ఈ ఆధ్యాత్మిక సదస్సుకు నెల్లూరు-గొలగమూడి రోడ్డులో వున్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదిక కానుంది. ఆధ్మాత్మికత వుట్టిపడే ఈ సదస్సుకు స్థానిక ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు ప్రజలు పెద్దఎత్తున తరలిరానున్నారు.*

సమాజ సంస్కరణాభిలాషతో వందల ఏళ్ళ క్రితమే సమాజంలో కులతత్వ నివారణకు కృషి చేసి, సమాజానికి ఆధ్యాత్మిక సుగంధం పూసే పలు విశిష్టమైన గ్రంథాలను రచించి, తన బోధలతో.. రచనలతో సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన మహనీయుడు శ్రీ భగవద్రామానుజస్వామి వారు. ఆ మహానుభావుడు జన్మించి 2017 నాటికి వెయ్యేళ్ళవుతున్న విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ప్రవచనాలను ప్రపంచానికంతా పున:పరిచయం చేయాలనే సదాశయంతో శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్‌స్వామి నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ బృహత్ కృషిలో భాగంగా, హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ఆశ్రమంలో సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో భగవద్రామానుజాచార్యుల భారీ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కంకణం కట్టుకున్నారు. వచ్చే ఏడాది అక్కడ 216అడుగులు ఎత్తున శ్రీ రామానుజస్వామివారి పంచలోహ విగ్రహాన్ని ప్రతిష్టించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' పేరుతో ఇంత భారీఎత్తున నిర్మించే ఆ 'సమతామూర్తి' విగ్రహం ఏర్పాటుకే కనీసం నూరుకోట్ల రూపాయల దాకా వ్యయమవుతుందని భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు సుమారు వెయ్యి కోట్ల రూపాయల దాకా వ్యయమవుతాయని అంచనా. మూడు దశల్లో జరిగే ఈ ప్రాజెక్టును 2022 నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో చిన్నజియ్యర్ స్వామివారు కృషి చేస్తున్నారు. అంతేకాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ శ్రీ రామానుజులస్వామివారి దివ్యక్షేత్రాలు వుండాలనే ఆకాంక్షతో విజయవాడలోని విజయ కీలాద్రి పర్వతంపై కూడా 108 అడుగుల ఎత్తయిన శ్రీ రామానుజుల స్వామివారి సుధామూర్తి (సిమెంట్ విగ్రహం) ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజులవారు రచించిన బృహత్ గ్రంథాలను, భాష్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీ భగవద్రామానుజస్వామివారి సహస్రాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 5న గొలగమూడిరోడ్డులో వున్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రముఖ దాత.. ఆధ్యాత్మికవేత్త శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సారథ్యంలో పెద్దఎత్తున 'ఆధ్యాత్మిక సదస్సు' ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సులో శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామివారి ప్రవచనాలు.. మంగళాశాసనం వుంటాయి.

భావితరాలకు స్ఫూర్తినిస్తూ, ఆధ్యాత్మిక రంగానికి అనితరసాధ్యమైన సేవలందించి అజరామర కీర్తినార్జించిన భగవత్ రామానుజాచార్యులవారు నాటి తరానికే కాదు.. నేటి తరానికీ.. భావితరాలకు కూడా స్ఫూర్తి ప్రదాత.. ఆ మానవతా దీప్తిని.. సమతా మూర్తిని స్మరించుకుంటూ.. సింహపురీయులందరికి శ్రీ రామానుజస్వాములవారి దివ్యబోధలను తెలుసుకునే సదవకాశాన్ని కల్పించేందుకు సద్భక్తితో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఏర్పాటుచేస్తున్న ఈ సదస్సుకు భక్తులు..ప్రజలు..ప్రముఖులు అందరూ తరలిరావాలని విపిఆర్ ఫౌండేషన్ సమాదరంతో స్వాగతిస్తోంది.



## 'ఆధ్యాత్మిక సదస్సు' కార్యక్రమ వివరాలు:

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ ఆధ్యాత్మిక సదస్సు కార్యక్రమ వివరాలిలా వున్నాయి. 5వతేది మంగళవారం ఉదయం 9 నుంచి 9.30గంటల దాకా పూజా కార్యక్రమం వుంటుంది. అనంతరం 10 నుంచి 10.30 గంటల దాకా ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌చే భక్తిగీతాలాపనలు వుంటాయి. ఆ తర్వాత, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామివారిచే 'భగవత్ రామానుజులవారి సహస్రాబ్ధి సందేశం' వుంటుంది.

అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసాంతం విని.. జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి.



## కాకతీయ సేవాసమితి...
# నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాఖ

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో గత నెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాకతీయ సేవాసమితి ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటరావు, నెల్లూరీయుడు అంబటి మాల కొండయ్య, యాలమూరి రంగయ్యనాయుడు, పొత్తూరి శైలజ, చెరుకూరు విజయలక్ష్మి, ఎస్.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కాకతీయ సేవాసమితి నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాఖ ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదివారం నాడు మాగుంట లే అవుట్‌లోని చంద్రయ్యచౌదరి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా ముప్వా బలరామయ్యనాయుడు, అధ్యక్షులుగా వట్టిగుంట చంద్రయ్యచౌదరి, ఉపాధ్యక్షులుగా కొల్లూరు నారాయణ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా దండమూడి హేమంత్‌కుమార్, కార్యదర్శిగా నలుబోలు బలరామయ్య నాయుడు, ఉపకార్యదర్శిగా ఉన్నం అంకయ్యనాయుడు, కోశాధికారిగా కొల్లి శ్రీనివాసులు నాయుడు, లీగల్ అడ్వైజర్‌గా వేళ్ల ఉపేంద్రచౌదరి, ఎంప్లాయిస్ సెల్ అడ్వైజర్‌గా కె.వెంకటసుబ్బానాయుడు, కమిటి సభ్యులుగా ఉప్పలపాటి జగదీష్ నాయుడు తదితరులు ఎన్నికయ్యారు.


## శుభాకాంక్షలు



ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌గా ఉన్నతమైన విలువలతో పని చేసి ఉద్యోగ ధర్మానికి వన్నె తెచ్చి పదవీ విరమణ చేసిన మా మిత్రుడు

**బండారు సుధాకర్‌రెడ్డి గారికి**

**పదవీ విరమణ శుభాకాంక్షలు.**

**బిరుదవోలు వెంకురెడ్డి**
చిల్డ్రన్స్ పార్క్‌వాకర్స్ ప్రెసిడెంట్, నెల్లూరు


## చెంగాళమ్మ ఆలయంలో అన్నదానానికి
# విపిఆర్ 2 లక్షల విరాళం



సూళ్ళూరుపేటలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి-ప్రశాంతి దంపతులు ఆదివారం రెండు లక్షల రూపాయల విరాళాన్ని అందజేసి తమ భక్తిని చాటుకున్నారు ఈ సందర్భంగా ఆమేరకు విరాళం చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. తొలుత వేమిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.




## 'ప్రభా'తం

# విషం చిమ్మిన డ్రాగన్

అణ్వస్త్రవ్యాప్తి నిరోధానికి కట్టుబడడమే ఎస్ఎస్‌జి సభ్యత్వానికి అసలైన అర్హత అయినప్పుడు, ఆ అర్హత అన్ని విధాలుగా భారత్‌కు వున్నప్పుడు, అలా సభ్యత్వం రాకపోవడం భారత్‌కు బాధాకరమే. భారత్ సభ్యత్వాన్ని అమెరికాతో సహా పలుదేశాలు సమర్థిస్తున్నా, చైనా కుయుక్తులతో, కుంటిసాకులతో అడ్డుపుల్ల వేసి సఫలీకృతం కావడం, అందులోనూ చైనా పాక్‌ను వెనకేసుకు రావడం గమనార్హం. అయినా, ఇలాంటి అంశాల్లో సంయమనంతో సానుకూల చర్చలు, దౌత్యపరమైన కృషే మన దేశానికి ఎల్లవేళలా శ్రీరామరక్ష!...

ఎవరమూ కలవరపడక్కర లేదు. ఒక్కోసారి ఇంతే.. ఇలాగే జరుగుతుంటుంది. మంచివారికి అన్యాయం అన్నది సర్వసాధారణమైపోతోంది. మనుషులకే కాదు, ఇప్పుడు దేశాలకు కూడా ఇదేమాట వర్తిస్తోంది. నీతిగా బతకడం ప్రధానం అన్నది పూర్వకాలపు మాట. కానీ ఇప్పుడు అది కాస్త మారింది. నీతిగా బతకడమే కాదు..నీతిగా బతుకుతున్నట్లు ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటూనే వుండాలన్నది నేటి మాట. అయితే, ఇప్పుడు కాకున్నా, ఎప్పటికైనా సరే.. న్యాయానికే కాలం వుంటుందని, చరిత్ర ఎప్పుడో నిరూపించింది. ఇదంతా ఎందుకంటే, విశ్వశాంతిని మనసావాచా ఆకాంక్షిస్తూ.. ప్రపంచంలోనే పరమశాంతి దేశంగా పేరొందిన భారతదేశానికి..అణ్వాస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం (న్యూక్లియర్ నాన్-ప్రొలిఫిరేషన్ ట్రీటీ-ఎన్‌పిటి) పై సంతకం చేయలేదన్న కుంటి సాకుతో.. 48 దేశాలతో ఏర్పాటైన బృందం (అణు ఇంధన సరఫరాదార్ల కూటమి-ఎన్ఎస్‌జి)లో భారత్‌కు స్థానం కల్పించకపోవడంలో జరిగిన అంతర్జాతీయ రాజకీయాలను గమనిస్తే ప్రపంచం ఎటుపోతోందా అనిపిస్తుంది. ఉగ్రవాదాన్ని, హింసను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ)లో భారత ప్రధాని నరేంద్రమోడీ ఎంతో ఉద్వేగంతో ప్రసంగిస్తున్న సందర్భంలోనే, సియోల్‌లో జరిగిన అణు సరఫరాదారుల కూటమి (ఎన్ఎస్‌జి) ప్లీనరీలో భారత్ సభ్యత్వానికి చైనా మోకాలడ్డింది. భారత్‌కు సభ్యత్వం విషయంలో సహకరించాలంటూ తాష్కెంట్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు పలుదేశాలు ఈ విషయంలో భారత్‌కు మద్దతిచ్చినా, చైనా ససేమిరా ఒప్పుకోకపోవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అమెరికాతో భారత్ సాన్నిహిత్యం పెరుగుతుండడం చైనాకు కంటగింపుగా వుండడం ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. అందులోనూ గతంలో క్షిపణి సాంకేతిక నియంత్రణ మండలి (ఎంటిసిఆర్)లో సభ్యత్వం కలిగించేందుకు అమెరికా భారత్‌కు పూర్తిస్థాయిలో సహకరించడం, చైనాకు దానిలో స్థానం లేకపోవడం కూడా చైనా గుర్రుకు మరో కారణం కావచ్చు. అయితే, ఎన్ఎస్‌జి విషయంలో చైనా భారత్‌ను వ్యతిరేకించడం కంటే, పాక్‌కు అనుకూలంగా వ్యవహరించడమే గమనించదగిన అంశం. ఇది చైనా-పాక్‌ల గాఢమైన మిత్రత్వానికి దృఢమైన తార్కాణం. ప్రపంచంలో జరుగుతున్న ఆధిపత్యపోరులో అమెరికాను సవాల్ చేయాలన్నది చైనా లక్ష్యం కాగా, అమెరికా అందులో ఏమాత్రమూ తక్కువ తినలేదు కనుక..చైనా దూకుడుకు అడుగడుగునా అడ్డుకట్టలు వేస్తూనే వుంది. అయితే, భారత్ మాత్రం తన దేశ ప్రయోజనాల దృష్ట్యానే కాక, విశ్వశాంతిని కూడా ఎల్లవేళలా కాంక్షిస్తూనే వుంటుంది. ప్రపంచమంతా శాంతియుతంగా, సంఘీభావంతో జీవించాలని, అందుకు ప్రతిబంధకంగా వున్న ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించాలని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నిటినీ సమాయత్తం చేసే దిశలో నిర్విరామ కృషి చేస్తోంది భారత్ ఒక్కటే. ఈ ఒక్క విషయం చాలు..ఎన్ఎస్‌జి లాంటి కూటముల్లో ఎన్ని సభ్యత్వాలైనా భారత్ పొందడానికి. అయినా, అసలు ఇలాంటి కూటమిలో మనదేశానికి సభ్యత్వం లేకపోయినా మునిగిపోయేదేమీ లేదు..కాకుంటే, వుంటే గింటే భవిష్యత్తులోనూ ఇబ్బందులుండవనే ఆలోచన తప్ప మరొకటి కాదు. ఇప్పుడే కాదు, భారత్‌ది ఎప్పుడూ శాంతి తత్వమే..విశ్వశాంతి మనస్తత్వమే. ఏనాడూ అణు సంబంధిత సాంకేతిక సామర్థ్యాన్ని ఇతరత్రా ఉపయోగాలకో.. జన వినాశాలకో..ఇతర దేశాలకో అమ్ముకున్న దుష్టచరిత్ర భారత్‌కు లేకపోవడం ఇందుకు నిదర్శనం. ఈ విషయంలో మచ్చలేని చరిత్ర భారత్‌ది. అయితే, చైనా మాత్రం అణ్వాస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకాలు చేసి, అణు ఇంధన సరఫరాదారుల కూటమిలో వున్నప్పటికీ, పలు సందర్భాల్లో ఇతర దేశాలకు, ముఖ్యంగా భారత్‌ను ఇరుకునపెట్టాలని చూస్తున్న పాకిస్తాన్‌కు అణుసంబంధిత పరికరాలను సైగ్గా అందించడం...ఏపాటి న్యాయమో ప్రపంచం గమనిస్తోంది. ఎన్ఎస్‌జిలో చేరేందుకు భారత్‌కు వున్న అర్హతలను పక్కనపెట్టి, చర్చలను పక్కదారి మళ్ళించడం.. ఒకవేళ భారత్‌కు సభ్యత్వమంటూ ఇస్తే పాక్‌కు కూడా ఇవ్వాలని మంకు పట్టు పట్టడం వంటి చైనా తిరకాసుల్లోని లోగుట్టు అందరికీ అర్థమవుతోంది. శత్రువుకు శత్రువు తనకు మిత్రుడనే భావంతో పాక్‌కు చైనా అన్నివిధాలా అండ దండలందిస్తోంది. అయినా, అక్రమ పద్ధతుల్లో అలా ఆయుధాలు సేకరించి ఉగ్రవాదాన్ని పెంచిపోషించే చరిత్ర వున్న పాక్‌కు..భారత్‌కూ పోలిక ఎక్కడ?.. ఇదలావుంటే, అసలు అణ్వాస్త్ర వ్యాప్తిని అడ్డుకునే ఆశయంతో..అణుపదార్థాలు కానీ, తత్సంబంధిత సాంకేతిక పరిజ్ఞానం కానీ దారితప్పి అణ్వాస్త్ర తయారీ దారులకు చేరకుండా కట్టడిచేయాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఎన్ఎస్‌జిలో.. ఇప్పుడు ఆ లక్ష్యానికి తగ్గట్టు పూర్తి అర్హతలున్న భారత్ వచ్చి సభ్యత్వాన్ని ఆశిస్తే..కాదనడం న్యాయమేనా అన్నది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అణ్వాస్త్రవ్యాప్తి నిరోధానికి కట్టుబడడమే ఎస్ఎస్‌జి సభ్యత్వానికి అసలైన అర్హత అయినప్పుడు, ఆ అర్హత అన్ని విధాలుగా భారత్‌కు వున్నప్పుడు, అలా సభ్యత్వం ఇవ్వలేకపోవడం భంగపాటు కాదు..బాధాకరమే. భారత్ సభ్యత్వాన్ని అమెరికాతో సహ పలుదేశాలు సమర్థిస్తున్నా, చైనాకు ఇదంతా ఇష్టంలేదు కనుక కుయుక్తులతో, కుంటిసాకులతో అడ్డుపుల్ల వేస్తోందనుకోవచ్చు. భారత్‌కు ఇక్కడ సభ్యత్వం లభిస్తే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భారత్ తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుందేమోనన్న ఆలోచన బహుశా చైనాను కలవరపరుస్తుండవచ్చు. ఏదేమైనా, అమెరికా-రష్యా వంటి అగ్రదేశాల మద్దతును సాధించిన భారత్, ఎన్ఎస్‌జి సభ్యత్వ విషయంలో మరింతగా ఆచి తూచి వ్యవహరిస్తూ దౌత్యవిధానమే మంచిమార్గంగా ముందుకు సాగుతోంది. ఇది న్యాయమైన మార్గం కనుక, ఇప్పుడు కాకపోయినా.. భవిష్యత్తులోనైనా ఆ కృషిలో భారత్ తప్పక విజయం సాధిస్తుందనడంలో..ఎవరికీ సందేహం అక్కరలేదు.

# మానవాళి ప్రయోజనం కోసమే.. సైన్స్

**- విఎస్‌యు వీసీ వీరయ్య**

మానవాళి ప్రయోజనం కోసం సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతోందని, చిన్నతనం నుంచే విద్యార్థులకు శాస్త్రీయ భావాలను పెంపొందించాలని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ వీరయ్య అన్నారు. నెల్లూరులోని హరనాథపురంలో ఇటీవల ప్రారంభమైన డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక 15వ జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సైన్స్‌తోనే సమాజాభ్యున్నతి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.శంకరయ్య మాట్లాడుతూ, జనవిజ్ఞాన వేదిక కేవలం మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే కాక, ప్రజారోగ్యం, విద్య, పర్యావరణం తదితర రంగాల్లోనూ విశేష కృషి చేస్తోందన్నారు. జెవివి జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.సూర్యప్రకాష్‌రావు, కార్యదర్శి కృష్ణారావు, యుటిఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు, ఆరోగ్యవిభాగం జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం.వి రమణయ్య, సైన్స్-టెక్నాలజీ కన్వీనర్ గౌస్‌బాషా, డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.బుజ్జయ్య, కార్యదర్శిగా భాస్కర్‌రావు, కోశాధికారిగా ఎం.కృష్ణారావు ఎన్నిక కాగా, కార్యదర్శివర్గంగా కె. కృష్ణారెడ్డి, పి.మాధవ, పెంచలయ్య, హరికృష్ణ, యానాదయ్య, అంకయ్య, డా. శ్రీనునాయక్, వేణుగోపాల్‌రావు, బి.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, కె. వెంకటేశ్వర్లు, ఎం.హరిబాబు, ఎస్.వెంగయ్య, జెవి రమేష్ ఎన్నికయ్యారు.

# క్యాప్ పాఠశాలకు గిరిజన పిల్లలు

చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే గిరిజన పిల్లలను లోక్‌అదాలత్ న్యాయమూర్తి సి.సత్యవాణి ఆధ్వర్యంలో ఇటీవల క్యాప్ పాఠశాలకు అప్పగించారు. నెల్లూరు బోడిగాడి తోట రైల్వేస్టేషన్లో చిత్తుకాగితాలు ఏరుకునే దుర్గయ్య, నాగమణి, సుప్రియ, సుబ్బరాయులు, లక్ష్మయ్య అనే పిల్లలు గత నెల 16న నెల్లూరు రైల్వేస్టేషన్ నుండి చెన్నైకి చేరుకోగా అక్కడి పోలీసులు వారిని గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. వారు నెల్లూరులో చైల్డ్ లైన్ నిర్వహిస్తున్న ఏఆర్‌డి స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్‌కు పిల్లలను అప్పగించారు. దీంతో ఆ చిన్నారుల తల్లిదండ్రులను గుర్తించి 25వ తేదీ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సత్యవాణి ఎదుట ప్రవేశపెట్టారు. ఈ పిల్లలను పోలీసుల ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాప్ పాఠశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ యామినీ, కౌన్సిలర్ మదన్‌మిశ్రా, లక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆర్థిక సాయం

నెల్లూరు మూలాపేటలోని శ్రీ అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో గత నెల 24న ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఎక్కువ శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మూలాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కె రషీదా, ఫత్తేఖాన్‌పేట రామయ్యబడి విద్యార్థిని వి.సాయి, మూలాపేట ఇయస్‌ఆర్‌యం ఉన్నత పాఠశాల హాస్టల్ విద్యార్థి సిహెచ్ శ్రీహరికి స్వర్గీయ అన్నదేవుల వెంకట్రామిరెడ్డి మనుమడు వి.శ్రీధర్, కెయస్‌ఆర్ ఆంజనేయులు ఆర్థిక సహాయంతో పురస్కారం జరిగింది. వీరికి విఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రశాఖాధ్యక్షులు మోపూరు వేణుగోపాలయ్య, ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల విశ్రాంత ఆంధ్రోపాధ్యాయుడు పాపిశెట్టి నాగరాజారావు, సమాజ ఉపాధ్యక్షుడు కారుమంచి సీతారామాంజనేయులు జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మూలాపేట ఇయస్‌ఆర్‌ఎం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాపిశెట్టి నాగారాజారావు పలకలు, నోటుపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ అసోసియేట్ అధ్యక్షులు పి.బాలరామిరెడ్డి కార్యదర్శి జి.రాధాకృష్ణయ్య, కోశాధికారి కల్పం శ్రీనివాసులు, లైబ్రేరియన్ జిఆర్ సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మనవాళ్ళంటే అంత చీపా!

చంద్రబాబునాయుడికి అధికారంతో కళ్లు తలకెక్కినట్లున్నాయి. మన ఇంజనీర్లను చాలా చులకన చేసి మాట్లాడుతున్నాడు. ఓ పక్క ప్రధాని నరేంద్రమోడీ మేకిన్ ఇండియా అంటూ సెల్‌ఫోన్‌ల నుండి యుద్ధవిమానాల దాకా అన్నింటినీ ఇక్కడే తయారు చేస్తుంటే చంద్రబాబు మాత్రం సింగపూర్ కంపెనీల చేత అమరావతి రాజధాని కడతానంటున్నాడు. కడితే కట్టాడు, మన నిర్మాణ కంపెనీలను, ఇంజనీర్లను చులకన చేసి మాట్లాడడమేమిటి? ఆఫ్ఘనిస్థాన్ పార్లమెంట్ భవనాన్ని కట్టింది తన ఏపిలోని నెల్లూరుజిల్లాకు చెందిన కాంట్రాక్ట్ సంస్థ అనే విషయం ఆయనకు తెలియదా? మనవాళ్లు కడితే మురికివాడలవుతాయట! కేవలం సింగపూర్ కంపెనీలతో కుదుర్చుకున్న వ్యాపార ప్రయోజనాల కోసమే చంద్రబాబు తపన అంతా!

**- పి.రాజశేఖరరెడ్డి, గుడ్లూరు.**

## భూములను కాపాడండి

చెన్నైలోని సదావర్తి ఆశ్రమం భూములను కారు చౌకగా కట్టబెట్టడం అన్యాయం. మారుమూల ప్రాంతాలలోనే ఇప్పుడు ఎకరా పాతిక లక్షలుంది. చెన్నైలో నివాసయోగ్యమైన ప్రాంతంలో భూములను ఇంత చౌకగా ఇవ్వడమేంటి. సదావర్తి ట్రస్ట్‌కు ఆదాయం పెంచాలంటే ప్రభుత్వమే అధికారులతో ఒక కమిటీని వేసి ఈ భూమిని ఫ్లాట్లుగా విభజించి అమ్మితే పెద్దమొత్తంలో ఆదాయం రావడం ఖాయం.

**సి.రాజీవి, నెల్లూరు.**




## విదేశాలు తిరిగితే సరా?

ప్రధాని నరేంద్ర మోడీ ఎక్కువ పాలనా కాలం విదేశాలు తిరగడంతోనే సరిపోయింది. ఆయన విదేశాంగ విధానం మంచిదే! దేశీయంగా నెలకొన్న సమస్యలను కూడా చూడాలి. ముఖ్యంగా చట్టాలలోని లోపాలను సవరించే దిశగా చర్యలు తీసుకోవాలి. మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. చెన్నై రైల్వేస్టేషన్‌లో పట్టపగలు ఓ అమ్మాయిని దారుణంగా చంపితే అడ్డుకునే పరిస్థితి లేదు. మహిళలపై క్రూర నేరాలకు పాల్పడేవారికి సత్వరమే కఠినశిక్షలు విధించేలా తగు చట్టం తీసుకురావాలి. కేంద్రప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టిపెట్టాలి.

**మేరీ శైల, నెల్లూరు.**

## ఏం జరిగింది... ఏం జరుగుతోంది... ఏం జరగబోతోంది

# అంతా నాకు తెలియాలి!



## నారాయణ కొత్త అవతారం

**ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా నెల్లూరు నగరపాలక సంస్థ అవినీతి విషయంలో మాజీఎమ్మెల్యే ఆనం వివేకా, మేయర్ అజీజ్‌ల మధ్య రేగిన వివాదం మంత్రి నారాయణ మెడకు చుట్టుకుంది. కార్పొరేషన్ అవినీతిపై వీరిద్దరూ ఒకర్నొకరు దుమ్మెత్తి పోసుకుంటూ పత్రికలకు, టీవీతెరలకు ఎక్కడం తెలిసిందే! వీరిద్దరి తిట్ల భాగోతాన్ని టీవీ ఛానెల్స్ పుణ్యాన చంద్రబాబు కూడా తిలకించారు.**

ఈ సంఘటనను చంద్రబాబు సీరియస్‌గా తీసుకుని మంత్రి నారాయణకు అక్షింతలు వేసినట్లు తెలుస్తోంది. నెల్లూరులో ఇంత జరుగుతుంటే మంత్రిగా నీకు తెలియదా? జిల్లాలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం నీకు లేదా? రాజధాని పనుల్లో బిజీగా వున్నా... అప్పుడప్పుడూ నెల్లూరుజిల్లాలో ఏం జరుగుతుందో తెలుసుకోండి, సొంత కార్పొరేషన్ మీదే పట్టు లేకుంటే ఇక మున్సిపల్ శాఖపై ఎలా పట్టుసాధిస్తావంటూ అయ్యవారికే చంద్రబాబు క్లాసు పీకాడు. ఈ ఎఫెక్ట్‌తో నారాయణ వెంటనే అలర్ట్ అయ్యాడు. నెల్లూరు నగరపాలక సంస్థలో ఇక నుండి తనకు తెలియకుండా ఏదీ జరగకూడదని హుకుం జారీ చేశాడు. దీంతో అజీజ్ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. ప్రతిదీ నారాయణకు తెలిసే చేయాలంటే ఇక మేయర్‌గా అజీజ్‌కు వున్న అధికారమేంటి?

నారాయణ మున్సిపల్ శాఖ మంత్రి అనే కాని, ఆయన పని చేస్తున్నది మాత్రం అమరావతి రాజధాని మంత్రిగా! తన శాఖ మీద కంటే కూడా ఆయనకు అమరావతి భూములపై పట్టు ఎక్కువ. తన శాఖను ఎప్పుడూ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక నెల్లూరు నగరపాలక సంస్థకు ప్రత్యేక నిధులు తీసుకు రావడం కోసం గాని, అభివృద్ధి పనుల మంజూరుకు గాని ఆయన ప్రత్యేకంగా చూపిన ఆసక్తి అంటూ ఏమీ లేదు. అప్పుడప్పుడు చుట్టం చూపుగా రావడం, మీటింగ్ పెట్టి పోవడం... ఇదే తంతు. ఇప్పుడు ఉన్నట్లుండి నెల్లూరు నగరపాలక సంస్థ విషయాలను తెలుసుకుని ప్రత్యేకంగా ఆయన చేసేది కూడా ఏమీ లేదు. కార్పొరేషన్‌లో ప్రతి అంశాన్ని ఆయన తెలుసుకోవాలనుకుంటే బి.పి పెరగడం తప్పితే ఇంకేమీ ఉండదు.

# వెంకయ్యను హత్తుకున్న నెల్లూరు



నెల్లూరంటే ఆయనకు అభిమానం. ఆయనంటే నెల్లూరు ప్రజలకూ అభిమానమే... నెల్లూరు... వెంకయ్య... ఈ కాంబినేషన్ సూపర్‌హిట్! ఓ పల్లెటూర్లో పుట్టిన రైతు బిడ్డ వెంకయ్యను జాతీయ స్థాయి రాజకీయాలలో మొనగాడిగా నిలిపింది నెల్లూరైతే, తాను గల్లీలో వున్నా ఢిల్లీలో వున్నా, ఏ రాష్ట్రంలో, ఏ నగరంలో వున్నా నెల్లూరు పేరును దేశమంతటికి పరిచయం చేసిన ఘనత వెంకయ్యది. అందుకే ఒకరిపట్ల ఒకరికి ప్రేమ, మురిపెం ఎప్పుడూ తగ్గదు. వెంకయ్యనాయుడు తొలిసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి వచ్చినప్పుడు ఈ నెల్లూరు ఎలా ఆదరించిందో, నాలుగోసారి రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు చేపట్టి వచ్చినప్పుడు కూడా అదే స్థాయిలో అభినందించింది.

వరుసగా నాలుగోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తనకంటూ ఆ దిశగా రికార్డు సృష్టించిన వెంకయ్య గత నెల 24వ తేదీన నెల్లూరుజిల్లాకు వచ్చారు. స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో కార్యక్రమం ముగించుకున్న అనంతరం వెంకటాచలం నుండి ర్యాలీగా బయలుదేరిన వెంకయ్యకు అడుగడుగునా అభిమానులు పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. ర్యాలీగా మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయంకు చేరుకున్నారు.

ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో వెంకయ్య తన గత స్మృతులను నెమరువేసుకున్నారు. నెల్లూరులో తాను విద్యార్థిగా తిరిగిన రోజులు, తిన్న బోండాలు, దోశెలు, చేసిన ఉద్యమాలు వంటివి గురించి వివరించారు. దేశవ్యాప్తంగా తిరగాల్సివున్నందున నెల్లూరుకు ఎక్కువగా రాలేకపోతున్నానంటూ బాధపడ్డారు. బీజేపీ గొప్పతనాన్ని వర్ణిస్తూ ఈరోజు దేశంలో అవినీతి మలినమంటని పార్టీ ఇదొక్కటేనన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సత్కరించుకున్నారు.

### శ్మశానవాటికలు...

# మన పెద్దల విశ్రాంతి నిలయాలు



జూన్ 26న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరులోని 25, 31వ డివిజన్లలో ప్రజాబాట నిర్వహించారు. 31వ డివిజన్ చాణిక్యపురిలో అత్యంత అధ్వాన్నంగా ఉన్న మెయిన్‌రోడ్డు పనులు వెంటనే ప్రారంభించకుంటే చూస్తూ ఊరుకోనని అధికారులకి చెప్పారు. అనంతరం 25వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్మశానవాటికను పరిశీలించారు. స్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే శ్మశానవాటికలు మన పూర్వీకులు శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న పవిత్ర స్థలమని, ఏదో ఒక రోజు మనమందరం కూడా శ్మశానవాటికలో శాశ్వత విశ్రాంతి తీసుకోవాల్సిన వాళ్ళమేనని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో శ్మశానవాటికల్లో కనీస వసతులు కల్పించి, వాటి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్మశానవాటికలో అంత్యక్రియలకి, కర్మక్రతువులకి, భవనాలు నిర్మించి ఇస్తానని, 6 నెలలలోపు దీనిని పూర్తి చేస్తానని, శ్మశానవాటికకు వచ్చే రహదారి ఏర్పాటుకు అధికారులపై వత్తిడి తెస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అరవ శ్రీను, హృదయ్‌కుమార్, అజయ్‌కుమార్, శ్రీకొలను వెంకటశేషారెడ్డి, రూబెన్, అరవింద్, ఆవుల వెంకటేశ్వర్లు, ఉడతా మురళి, వాసుదేవరావు, చక్రధర్, శారద, భారతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు జెసి ఇంతియాజ్ వితరణ



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తన సొంత నిధులతో పేదలకు సరకులు, నగదును వితరణగా అందజేశారు. జూన్26న జెసి తన బంగ్లాలో ఆ మేరకు పేదలకు సాయం అందజేశారు. కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం గ్రామానికి చెందిన పది కుటుంబాలవారికి, వికలాంగులకు కిలో కందిపప్పు, కిలో చక్కెరతో పాటు కొంత నగదును వారికి అందజేశారు.



### మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట శరత్‌చంద్రారెడ్డి తదితరులు

పవిత్ర రంజాన్ మాసంలో మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవాసమమితి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు హరనాథపురంలోని మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ విందుకు విచ్చేసిన ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో మీతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనే అవకాశం కల్పించడం చాలా సంతోషంగా వుందని, త్యాగానికి, భక్తికి, మనిషిలోని ఆత్మశుద్ధికి ప్రతీక ఈ రంజాన్ మాసం అని, ప్రతి ఒక్కరూ ఎంతో నిష్టగా ఉపవాసాలు ఆచరిస్తూ, భగవంతుని నియమాలను తూచ తప్పకుండా పాటిస్తూ తమ భక్తి భావాన్ని చాటుకునే గొప్ప కాలమిదన్నారు. మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ సాటి మనిషి పట్ల దయ చూపడం, ఉన్నదాంట్లోనే నలుగురికి పంచడం ఆ అల్లా మనకు చూపించిన సన్మార్గమని, మనమంతా ఆ భగవంతుడి ఆదేశాలను పాటిస్తూ సన్మార్గంలో నడిస్తే ఈ భూమ్మీద చెడును పారద్రోలి మంచిని పెంపొందించవచ్చన్నారు. ఈ రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేస్తున్న ప్రతి సోదరునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ జె.వి.రాముడు, సమితి సభ్యులు సాయి, అశోక్, బాబు, మహేష్, రామరాజు, నిషాద్, పెద్దసంఖ్యలో మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# వాత్సల్యకు రూ.3.25 లక్షల దుస్తులు



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న సెంథిల్‌కుమార్

నెల్లూరులోని జనహిత వాత్సల్య అనాథ శరణాలయానికి రూ. 3.25లక్షలు విలువైన యూనిఫారాలు, దుస్తులను పానాసోనిక్ కార్బన్ కంపెని ఇటీవల అందజేసింది. వాత్సల్య ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పానాసోనిక్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. సెంథిల్‌కుమార్ దుస్తులను అందజేసి మాట్లాడుతూ సమాజంలో అనేకమంది అనాథలు పేదలు సరైన విద్య, వైద్యం, తిండి, బట్ట లేక అలమటిస్తున్నారన్నారు. వారి ఉజ్వల భవిష్యత్ కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. జనహిత వాత్సల్య ట్రస్టు అనాథశరణాలయం, హైస్కూలు, ఆంజనేయస్వామి ఆలయం, ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ వంటి వాటిని బాగా నిర్వహిస్తోందని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జనహిత వాత్సల్య సంస్థ గౌరవాధ్యక్షుడు సామంతు గోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాత్సల్య సంస్థ కార్యదర్శి జి.వి.సాంబశివరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సభ్యుడు ఇ.వి.యస్.నాయుడు, సింహపురి వైద్యసేవాసమితి కార్యదర్శి నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, శ్రీహరిహరన్ ఎడ్యుకేషన్ సొసైటి కార్యదర్శి రామదండు, మీనాక్షి పవర్‌ప్లాంట్ మేనేజర్ శ్రీరామ్, డాక్టర్ గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అనాధలకు 'నేస్తం' ఆదరణ



గొల్లపాళెంలోని చైల్డ్ ఆశ్రమంలో వున్న అనాధ పిల్లలకు నెల్లూరులోని నేస్తం ఫౌండేషన్‌వారు గత నెల 26న దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు కోరెం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, అర్జున్, త్రినాథ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు శరత్, ఫౌండేషన్ సభ్యులు చైతన్య, వినోద్, వెంకటేశ్వరరావు, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# పోలీస్ పెట్రోల్ బంకు

నెల్లూరు దర్గామిట్ట పోలీసు కార్యాలయం రోడ్డులోని పోలీసు క్లబ్ ఆవరణలో త్వరలో పోలీస్ పెట్రోల్ బంకు అందుబాటులోకి రానుంది. ఇంతకుముందు పోలీసు కార్యాలయం లోపల ఈ పెట్రోల్‌బంకు ఉండేది. దానిని ఇప్పుడు క్లబ్ ఆవరణలోకి మారుస్తున్నారు. స్థలాన్ని, లైసెన్స్‌ను లీజు ప్రాతిపదికన ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పెట్రోల్ బంకులో ఇక పోలీసు వాహనాలతో పాటు బయట వాహనదారులు కూడా పెట్రోల్, డీజిల్ పట్టించుకోవచ్చు.

# ఇన్‌ఛార్జ్ డిఇఓగా విజయలక్ష్మి



జిల్లా ఇన్‌ఛార్జ్ డిఇఓగా పల్లిపాడులోని ఉపాధ్యాయుల శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ శ్రీమతి విజయలక్ష్మిని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి జూన్ 28న ఉత్తర్వులు జారీ చేశారు. ఓ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకునే విషయంలో తన ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యం చేసినందుకు జిల్లా కలెక్టర్ యం.జానకి డిఇఓగా వున్న ఆంజనేయులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం తెలిసిందే! ఆంజనేయులు విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో విజయలక్ష్మిని ఇన్‌ఛార్జ్‌గా వేశారు. అలాగే బి.ఇడి కాలేజీకి కూడా ఆంజనేయులే ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఇప్పుడు ఆయన సస్పెండ్‌లో ఉండడంతో గుంటూరు ఆర్జేడీ పార్వతికి బి.ఇడి కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలప్పగించారు.

# ఊపందుకున్న 'సేవ్ నెల్లూరు'




సామాజిక మాధ్యమాలలో వినోద్‌రెడ్డి షేర్ చేసిన 'సేవ్‌నెల్లూరు'

నెల్లూరు నగరంలో మంచినీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీకి హడ్కో నిధులు 1136కోట్లతో పనులు చేయడానికి వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్ రెడ్డి ప్రారంభించిన 'సేవ్ నెల్లూరు' ఉద్యమం ప్రజల్లోకి బాగానే పోతోంది. వినోద్‌రెడ్డి సామాజిక మీడియాలో మంచి దిట్ట కాబట్టి ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో దీనిని బాగానే ఎక్కిస్తున్నారు. హడ్కో నిధులు నెల్లూరుకు ఇస్తున్న అప్పు అని, ఏడాదికి 110కోట్లు వడ్డీ కట్టాలని, ప్రతి తలపై 5లక్షల రూపాయల భారం పడుతుందంటూ వినోద్ ఈ ఉద్యమాన్ని మొదలుపెట్టాడు. నగరం నిండా సెప్టిక్ ట్యాంకులు తయారవుతాయని, దుర్గంధమయం అవుతుందని, దోమలు, పందులతోనే ఛస్తుంటే ఈ గబ్బుతో మరికొన్ని రోగాలు ఖాయమంటూ ఆయన ప్రచారం చేస్తున్నారు. దీనికి సంబంధించి తక్కువ నిడివిగల డాక్యుమెంటరీ కూడా తయారు చేసి సామాజిక మాధ్యమంలో విస్తృతంగానే ప్రచారం చేస్తున్నాడు. అలాగే నగరమంతా కూడా దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఫ్లెక్సీలు కూడా కట్టించాడు.

# వాకర్స్ సేవలు ఆదర్శనీయం




దాతృత్వ పురస్కారాలను అందజేస్తున్న కృష్ణకుమారి

సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు వాకర్స్ అసోసియేషన్ వారు తమ సొంత నిధులతో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కృష్ణకుమారి అభినందించారు. మే 1 నుంచి 31 వరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో వివిధ క్రీడాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు హాజరైన క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీకి సహకరించిన దాతలకు ఈ సందర్భంగా దాతృత్వ పురస్కారాలను అందజేశారు. ఏసి సుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో ఆదివారం ఆ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉత్తమ్ జాబ్స్ అధినేత పురుషోత్తం ఈ జ్ఞాపికలను అందజేశారు. వాకర్స్ గవర్నర్ శ్రీనివాసులురెడ్డి, ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఉపాధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, బెజవాడ సుందరరామిరెడ్డి, హరిప్రసాద్‌రావు, శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఇఫ్తార్‌లో అజీజ్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత నెల 24వ తేదీన గుంటూరులోని సన్నిధి ఫంక్షన్‌హాల్‌లో ముస్లిం సోదరుల కోసం ఇచ్చిన ఇఫ్తార్ విందుకు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ కూడా హాజరయ్యాడు. విందులో పలువురు మంత్రులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

### తిరుమలకు

# డెయిరీ ఉద్యోగులు

నెల్లూరులోని విజయ డెయిరీలో పర్మినెంట్ అయిన 35మంది ఉద్యోగులు సోమవారం వెంకటేశ్వరస్వామికి మొక్కు తీర్చుకోవడానికి తిరుమలకు వెళ్లారు. వీళ్లు బయలుదేరిన ప్రత్యేక బస్సును విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించాడు. సంస్థలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఈ 35మందిని పర్మినెంట్ చేశారు. ఈ సంతోష సమయంలో వారు తిరుమల బాట పట్టారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఎండి కృష్ణమోహన్ కూడా పాల్గొన్నారు.

# శాంతించిన సూరి

మండే ఎండల నుండి ఉపశమనం లభించినట్లేననిపిస్తోంది. నైరుతి ఋతుపవనాల వల్ల బలమైన వానలు లేకపోయినా వాతావరణం చల్లబడింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మబ్బులు పట్టడం, చల్లగాలులు వీయడం, అప్పుడప్పుడు సన్నజల్లులు పడడం... మొన్నటి వరకు చెమట్లు కార్చుకుంటూ తిరిగిన ప్రజలకి ఆహ్లాదకరంగా వుంది.

### పరిశ్రమల శాఖ

# జీఎంగా ప్రదీప్‌కుమార్

నెల్లూరుజిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా వై.యల్.ప్రదీప్‌కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ పనిచేస్తున్న ఏ.సుధాకర్‌ను గుంటూరుజిల్లాకు బదిలీ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్ గతంలో కర్నూలుజిల్లాలో పని చేశారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన, అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. ప్రభుత్వం కొత్త విధానాలతో త్వరితగతిన పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఇంటర్నేషనల్ వాకర్స్

# ఛైర్మెన్‌గా 'మండవ'



ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఛైర్మెన్‌గా నెల్లూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇటీవల బరంపురంలో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ సభలో ఈ నియామకం జరిగింది. ఈ మేరకు గత నెల 25న ధృవీకరణ పత్రాలు అందాయి. మండవ గతంలో జడ్పీ వాకర్స్ ప్రధానకార్యదర్శిగా మూడుసార్లు ఎంపికై, రెండుసార్లు ఉత్తమ కార్యదర్శి అవార్డులు గెలుపొందారు.

# సంతోషోత్సవంగా.. కళాంజలి సంగీత దినోత్సవం

- సినీ సంగీత దర్శకుడు సాయి కార్తీక్‌కు 'కళాంజలి పురస్కారం'



జ్యోతి ప్రజ్వలనతో సంగీత దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు



సాయికార్తీక్ - దివిజలకు 'కళాంజలి పురస్కారం'

నెల్లూరంటే కళలకు పుట్టిల్లు. కళాకారుల పొదరిల్లు. సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళల హరివిల్లు. ఇక్కడ కళలు ఎప్పుడూ కళకళలాడుతూనే ఉంటాయి. కళాకారులకెప్పుడూ ఆదరణ వుంటుంది. దానికి కారణం కళలను ప్రోత్సహించే దాతలేకాదు, ఆ కళావేడుకలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించే కళారంగ సంస్థలు ఉండడం కూడా!

నెల్లూరులో కళలకు పెద్దపీట వేస్తూ, ఎటువంటి ప్రచారార్భాటాలకు పోకుండా తనదైన శైలిలో క్రమం తప్పకుండా కళా, సంగీత వేడుకలను నిర్వహిస్తున్న సంస్థే కళాంజలి సాంస్కృతిక సంస్థ.

వీరిశెట్టి హజరత్‌బాబు గౌరవాధ్యక్షులుగా, కళాంజలి అనంత్ సారధ్యంలో నడుస్తున్న ఈ సంస్థ నెల్లూరు కళావేదికపై ఇప్పటికే ఎన్నో అద్భుతమైన సంగీత, సాంస్కృతిక వేడుకలను నిర్వహించి కళాభిమానుల మన్ననలు చూరగొంది. ఈ పరంపరలోనే జూన్ 26వ తేదీ సాయంత్రం నెల్లూరు పురమందిరంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని సంతోష దినోత్సవంగా నిర్వహించింది.

ఈ సంగీత దినోత్సవం సంబరానికి వర్ధమాన హీరో నారా రోహిత్ విశిష్ట అతిథిగా రాగా, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. నెల్లూరు నగర శాసనసభ్యులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కావలి మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, యువజన సేవాభిలాషి మాగుంట శరత్‌చంద్రారెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కన్వీనర్ నలుబోలు బలరామయ్య నాయుడులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.



రోహిత్‌కు జ్ఞాపిక

అతి తక్కువ కాలంలోనే 50కి పైగా చలనచిత్రాలకు సంగీతం అందించిన నెల్లూరు అల్లుడు(రేబాల రమణ-శ్రీలక్ష్మి అల్లుడు) సాయికార్తీక్‌ను ఆయన సతీమణి, గాయని దివిజను ఈ సందర్భంగా అతిథులు కళాంజలి పురస్కారంతో సత్కరించారు. తనకు జరిగిన సత్కారానికి స్పందిస్తూ సాయికార్తీక్ కళాంజలి సంస్థకు, వేదిక మీదున్న అతిథులకు, తన కోసం ప్రత్యేకంగా విచ్చేసిన హీరో నారా రోహిత్‌కు, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, తనను ప్రోత్సహించిన అత్తమామలు, భార్యకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. నెల్లూరంటే తనకు ఇష్టమని, ఇక్కడ నుండే తాను ఎన్నో కార్యక్రమాలలో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నాడు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తనకు మ్యూజిక్ సెన్స్ తక్కువని, అయినా కళాంజలి సంస్థ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో పాల్గొంటున్నానని చెప్పాడు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు అల్లుడు సాయి కార్తీక్, నెల్లూరు కూతురు దివిజలను ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా సత్కరించడం సంగీతానికి జరిగిన సత్కారంగా పేర్కొన్నాడు. సాయికార్తీక్, దివిజలు 2002లో నెల్లూరులో 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'నవ్వుల పండుగ'లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశాడు. ప్రపంచంలోనే మేటి గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మన నెల్లూరు బిడ్డ అయినందుకు మనమంతా గర్వపడాలని, డ్రమ్స్ మాస్ట్రో శివమణి, ప్రముఖ గాయని జానకి... ఇలాంటి వారంతా నెల్లూరుతో బంధం, అనుబంధం ఉన్నవాళ్లేనని చెప్పాడు. మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి నెల్లూరు ఎంతోమంది కళాకారులను అందించిందని, మన కొత్త రాజధాని అమరావతికి కూడా నెల్లూరు నుండే కళాకారులు వెళ్లాలన్నారు.





ఈ సందర్భంగా సినీహీరో నారా రోహిత్‌ను కూడా కళాంజలితో పాటు అభిమానులు ఘనంగా సత్కరించారు. సభా ప్రారంభానికి ముందు గాయనీగాయకులు రోహిత్, నరసింహ, గాయత్రి, అనూష, జ్ఞానశ్రీ, దివ్యలు ఆలపించిన మధురగీతాలతో ప్రేక్షకులు మైమరచిపోగా, సాయి హేమంత్ నాసికా వేణుగానంతో టౌన్‌హాల్ చప్పట్లతో మార్మోగింది.

సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత, సాహిత్య, కళారంగాలలో సేవలందించిన పలువురిని కళాంజలి సంస్థ తరఫున అతిథులు సత్కరించారు. కళాంజలి అనంత్ పర్యవేక్షణలో బెనర్జీ వ్యాఖ్యానంతో సంగీత దినోత్సవ వేడుక సందడిగా ముగిసింది.

# మత్తుతో బ్రతుకులు చిత్తు

యువత మారకద్రవ్యాల బారిన పడకుండా భావిపౌరులుగా తీర్చి దిద్దుటలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు విఆర్‌సి కళాశాల మైదానంలో అంతర్జాతీయ మారకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ ర్యాలీ విఆర్ కళాశాల మైదానం నుండి గాంధీబొమ్మ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ సమాజంలో కొంతమంది యువత మత్తుమందులకు లోనై వారి భవిష్యత్తులను పాడుచేసుకోవడం జరుగుతుందని, అటువంటివి జరగకుండా మత్తుమందులు,




ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ యం.జానకి

తదితర మారకద్రవ్యాల నివారణకు సంబంధించిన ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు అన్ని పాఠశాలలు, కళాశాలలలో నిర్వహించాలని, వాటిపై వచ్చే దుష్పరిణామాలు గురించి తెలియజేయాలన్నారు. జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మారకద్రవ్యాల నివారణపై కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో జేసీ ఎ.ఎం.డి.ఇంతియాజ్, ఎక్సైజ్ శాఖ సహాయకమిషనర్ జి.చెన్నకేశవరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బలరామకృష్ణ, గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు బాబు శ్రీధర్, మధుసూదన్‌రావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




# 'గ్లోబల్'లో జ్ఞానసాయికి వైద్యసేవలు



జ్ఞానసాయితో డాక్టర్ రేలా

తొమ్మిది నెలల చిరుప్రాయంలోనే కాలేయ వ్యాధికి గురై ప్రాణపాయ స్థితిలో వున్న చిన్నారి జ్ఞానసాయికి చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెకు చెందిన జ్ఞానసాయికి పుట్టుకతోనే కామెర్లవ్యాధి వచ్చి, క్రమంగా కాలేయం దెబ్బతింది. ఈ పాప బ్రతకాలంటే దాదాపు 30లక్షలు ఖర్చు చేయాలి. పాప తల్లిదండ్రులది అంత ఖర్చు పెట్టుకోలేని స్థితి. ఈ దశలో మీడియా ద్వారా ఆ పాప గురించి లోకానికి తెలిసింది. ఈ పాప పరిస్థితి తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించారు. ఆ పాప వైద్య చికిత్సకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. తక్షణ వైద్య చికిత్స నిమిత్తం జ్ఞానసాయిని చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రికి పంపించారు. కాలేయం మార్పిడిలో అంతర్జాతీయంగా పేరున్న డాక్టర్ మహ్మద్‌రేలా జ్ఞానసాయికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇతర చిన్నారుల్లా జ్ఞానసాయి హాయిగా జీవించాలంటే ఆమెకు 95శాతం కాలేయ మార్పిడి అవసరముందని రేలా అభిప్రాయపడ్డారు. గ్లోబల్ ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో జ్ఞానసాయికి వైద్యపరీక్షలు, కాలేయ మార్పిడి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# అలరించిన శివనాదామృతం



'కలైమామణి' రాజేశ్వరిని సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సభ ఆధ్వర్యంలో జూన్ 25న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన భక్తి సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. శ్రీ గురుకృప సంగీత విద్యాలయం విద్యార్థినులచే నిర్వహించిన శివనాదామృతం, శివతాండవ వైభవం సంగీత ప్రియులను, కళాభిమానులను అలరించింది. విశిష్ట అతిథిగా పాల్గొన్న తమిళనాడు ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కలైమామణి యస్.రాజేశ్వరి కచేరి వీనుల విందుగా సాగింది. అనంతరం రాజేశ్వరిని నిర్వాహకులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. శ్రీ గురుకృప సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు ఎ.లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, మురళీకృష్ణ70 ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ కోట సునీల్, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మాచవోలు భాస్కరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కాకరపర్తి జగన్మోహన్‌రావు, కళాంజలి అనంత్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# డిఆర్‌ఓకు ఆత్మీయ సన్మానం



జూన్ 30న పదవీ విరమణ చేస్తున్న డిఆర్‌ఓ సుదర్శనరెడ్డిని ఆదివారం నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ అధికారుల అసోసియేషన్, రెవెన్యూ మిత్రబృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ డిఆర్‌ఓ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ దంపతులను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న తెలుగు గంగ డిప్యూటి కలెక్టర్ వేణుగోపాలరెడ్డిని కూడా ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, డిఆర్‌ఓ, తెలుగు గంగ డిప్యూటి కలెక్టర్‌ల సేవలను ప్రశంసించారు. ఈ సభకు జేసి–2 ఆర్‌ఎస్ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, డిఆర్‌ఓ సుదర్శనరెడ్డి ఆర్డీఓగా, డిఆర్‌ఓగా పాలు ప్రాంతాల్లో విశిష్టమైన సేవలందించారని అభినందించారు. కార్పొరేషన్ టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రమౌళి, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, మంత్రి ఓఎస్‌డి పెంచలరెడ్డి, డ్వామా పి.డి హరిత, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ మార్కండేయులు, ఆర్డీఓలు ఎంవి రమణ, నరసింహన్, బాబయ్యలతో పాటు అధికారులు రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, కనక నరసారెడ్డి, రవీంద్రబాబు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'రఘు పేరడీలు' ఆవిష్కరణ



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ సెమినార్ హాలులో రచయిత డా॥ రాచపాళెం రఘు రచించిన 'రఘు పేరడీలు – మాంటో క్రిస్టో గీరడీలు' పుస్తకాన్ని విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య ఆవిష్కరించి మొదటి ప్రతిని శుభమస్తు షాపింగ్‌మాల్ మేనేజింగ్ డైరెక్టర్ బయ్యా శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కవులు రచయితలు సమాజాన్ని ప్రతిబింబించే రచనలు వెలువరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుస్తక సమీక్షకురాలిగా డా॥ సోమిరెడ్డి జయప్రద వ్యవహరించారు. కె.మురళీమోహన్‌రాజు, వొమ్మిన నాగసతీష్, ప్రిన్సిపల్ వెంకట్రావ్, ఊరుబిండి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## నెల్‌క్యాస్ట్, రోటరీ వెస్ట్ ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం, రక్తదానం





వైద్య శిబిరం



రక్తదాన శిబిరం

గూడూరు నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ మరియు వెస్ట్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీ ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం జరిగింది. బొల్లినేని(కిమ్స్) ఆసుపత్రి వైద్యులతో జనరల్ చెకప్, కంటి, చర్మ మరియు దంత సంబంధిత పరీక్షలు జరిపారు. ఈ శిబిరంలో సుమారు 200మంది నెల్‌క్యాస్ట్ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. 50మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ యన్.ఎస్.రెడ్డి, డీజీఎమ్‌హెచ్‌ఆర్ టి.మురళీకృష్ణ, పిఆర్‌ఓ ఆనిమెళ్ళ శివకుమార్, రోటరీ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, రొటేరియన్లు వై.గోపాల్‌రెడ్డి, శేగు శ్రీనివాసులు, యు.వాసుగౌడ్, డి.సుబ్రహ్మణ్యం, నాశిన నాగులు, కె.సుందరరామిరెడ్డి, బలరామిరెడ్డి, పిఎమ్ రావు, బొల్లినేని హాస్పిటల్ పిఆర్‌ఓ నవీన్ జయకుమార్, ప్రభుత్వవైద్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్ వార్తలు

# ఎన్‌బికెఆర్‌లో అన్ని సీట్లు భర్తీ

## – డైరెక్టర్ డా॥ వి.విజయకుమార్‌రెడ్డి



నెల్లూరుజిల్లా విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈ విద్యా సంవత్సరానికిగాను కన్వీనర్ కోటా క్రింద అన్ని బ్రాంచీలలో పూర్తిగా అన్ని సీట్లు భర్తీ అయినట్లు కళాశాల డైరెక్టర్ డా॥ వి.విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. 2016–17 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు కేటాయింపబడిన విద్యార్థుల జాబితాను ఎంసెట్ కన్వీనర్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఇసిఇ, ఇఇఇ, సిఎస్‌ఇ, మెకానికల్, సివిల్ బ్రాంచీలలో తమ కళాశాలలో ఉన్న 504సీట్లకు గాను పూర్తి సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. కళాశాలలోని బోధనా సిబ్బంది, మౌలిక వసతులు పరిశీలించిన తర్వాత తమ కళాశాలకు బోధనా రుసుమును రూ.93,200/–లుగా ప్రభుత్వం కేటాయించిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాల స్థాయిని గుర్తించి అధికఫీజు అయినప్పటికీ తమ కళాశాలను ఎంపిక చేసుకోవడం వల్ల జిల్లాలో పూర్తిగా సీట్లు భర్తీ కాబడిన ఏకైక కళాశాల తమదేనన్నారు. ఈ ఘనతను సాధించడానికి సహకరించిన తమ కళాశాల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఫీజు పెంపు ద్వారా లభించనున్న నిధులను పూర్తిగా కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల పురోగతికి, ప్లేస్‌మెంట్‌లు అభివృద్ధి చేయడానికి ఖర్చు పెట్టనున్నట్లు తెలిపారు. కళాశాలను ప్రగతిపథంలో నిర్వహించడానికి అన్ని విధాల ప్రోత్సహిస్తున్న తమ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి తమ సిబ్బంది, విద్యార్థులు తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

# సరస్వతి శిశుమందిర్‌కు బస్సు



సరస్వతీ శిశు మందిరం బస్సును ప్రారంభిస్తున్న డిఎస్పీ శ్రీనివాస్, ప్రక్కన సిఆర్‌రెడ్డి, సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి తదితరులు



ఆర్.ఓ మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న డిఎస్పీ

గూడూరులోని సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి తన తండ్రి చెరుకూరి వెంకురెడ్డి జ్ఞాపకార్థం 6.50లక్షలతో ఏర్పాటు చేసిన బస్సును గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు.

దీంతోపాటు పాఠశాలలో ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంటును కూడా అమర్చి నీటిని అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ గూడూరులో దాతలకు కొదవలేదని, దాతలు అందించిన సాయంతో విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఇంకా పలువురు వక్తలు మాట్లాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.వి.అశోక్‌చక్రవర్తి, మునిరాజా, రొటేరియన్లు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సిఆర్ రెడ్డి, జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, దశరథ రామిరెడ్డి, మురళీరెడ్డి, ఆర్‌విరావు, ఇందిర, సౌందర్యమ్మ, కె.సీతమ్మ, కె.సుందరరామిరెడ్డి, వై.లక్ష్మి, పరమేశ్వరీ పద్మ, విష్ణువందనలు పాల్గొన్నారు.

# రోటరీ 'వెల్ బేబీ షో'





డాక్టర్ యన్.జయలక్ష్మి ద్వారా బ్యూటిఫుల్ బేబిగా ఫస్ట్ ప్రైజ్ అందుకొంటున్న శరత్‌కళా

గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రోటరీ భవన్‌లో 'వెల్ బేబి షో' నిర్వహించారు. బ్యూటిఫుల్ బేబిగా శరత్‌కళా (జి.వి.యస్.స్కూల్), జహీరా, కనిష్క, హెల్త్ బేబిగా ధీరజ్, అశ్లేష, శాస్యజ్ఞ ప్రియ, స్మైలీ బేబిగా సంజన, లాస్యశ్రీ, లహరి కి క్యాష్ అవార్డు, మెమెంటోలు అందజేశారు. మొత్తం ఈ షోలో 29మంది పాల్గొనగా అందులో 9మందిని సెలక్ట్ చేశారు. జడ్జీలుగా దంత వైద్యులు డాక్టర్ యన్.జయలక్ష్మి, మహిళా మండలి అధ్యక్షురాలు ఎమ్.విష్ణువందన పాల్గొని గెలుపొందిన వారికి క్యాష్ అవార్డు, మెమెంటోలు అందజేశారు. స్పాన్సర్‌గా శ్యాంసుందరరావు వ్యవహరించారు. రోటరీ అధ్యక్షులు యస్.వి.అశోక్‌చక్రవర్తి, కార్యదర్శి పి.మునిరాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రొటేరియన్లు కె.మునిగిరీష్, కె.సుందరరామిరెడ్డి, జిఎస్ రాఘవరెడ్డి, కాబోయే రోటరీ అధ్యక్షులు యన్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# నెల్లూరులో ఐక్యరాజ్య సమితి శాంతి దళం

అది విజయవాడలోని హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు కార్యాలయం. సీఎం ప్రెస్ కాన్ఫరెన్స్... మంత్రులు పి.నారాయణ, కె.ఇ.కృష్ణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్ప, సిఆర్‌డిఏ కమిషనర్ శ్రీకాంత్‌లు కూడా ఉన్నారు. చంద్రబాబు ప్రెస్‌మీట్ మొదలుపెట్టాడు. సింగపూర్ అమరావతి రాజధాని అంకంలో ఈరోజు మరో అడుగు ముందుకేసాం. రైతులందరికీ లక్కీడిప్ తీసి ఫ్లాట్ల నెంబర్‌లు చీటీల మీద వ్రాసిచ్చాం. భవిష్యత్‌లో ఆ చీటీలే వాళ్ళ ఆస్థి. ఇక రాజధాని కాంట్రాక్ట్‌ను స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో సింగపూర్ కంపెనీకిచ్చామని చెబుతుండగా... 'ఆత్మసాక్షి' పత్రిక విలేకరి లేచి... సార్, మన దేశంలో ఎన్నో నిర్మాణ కంపెనీలు ఉండగా విదేశీ కంపెనీలకు రాజధాని నిర్మాణ కాంట్రాక్ట్‌ను అప్పగించడంలో మర్మమేంటని ప్రశ్నించాడు. చంద్రబాబు శాంతంగా బదులిస్తూ... రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లులాగా ఆలోచించమన్నారు. నేను సింగపూర్ లాంటి రాజధానిలో ఉండాలనుకుంటున్నప్పుడు సింగపూరియన్‌లాగే ఆలోచించాలి. మన వాళ్లు కడితే అవి స్లమ్‌సిటీలవుతాయి గాని, స్లిమ్ సిటీలవుతాయా... అందుకే కాంట్రాక్ట్ సింగపూర్ కంపెనీకిచ్చాను... 'జై జన్మభూమి' అంటూ ముగించాడు.

అప్పుడే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీరియస్‌గా అక్కడకు వచ్చి చంద్రబాబు చెవిలో ఏదో చెప్పాడు. అది విన్న చంద్రబాబు ముఖం సీరియస్‌గా మారిపోయింది. పక్కనున్న నారాయణతో... ఏంది నారాయణ ఇది... దారినపోయే గబ్బును తెచ్చి ఇంట్లో పెట్టావ్ అని అడిగాడు. నారాయణ టెన్షన్‌పడుతూ ఏమైంది సార్, నా వల్ల ఏ తప్పు జరిగింది సార్ అని అడిగాడు. చెప్పడమెందుకు చూడు అంటూ టీవీ ఆన్ చేసి పుకార్ 1+1=11/666 ఛానెల్ పెట్టాడు. అప్పుడే నెల్లూరు నగరపాలక సంస్థ అవినీతిపై స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65), మేయర్ అజీజ్‌ల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మధ్యలో ఛానెల్ డిబేటర్ నారద చైతన్య డిబేట్ ప్రారంభసూచికగా అగ్గిపుల్ల వెలిగించాడు.

**వివేకా :** నెల్లూరు కార్పొరేషన్ అవినీతిమయమైపోయింది. కార్పొరేషన్ సొమ్మును పందికుక్కల్లా తింటున్నారు. అజీజ్ కలెక్షన్ సెంటర్లు తెరిచాడు. వాళ్ల తమ్ముడు దందాలు చేస్తున్నాడు. ప్రతి పనికీ రేటు ఫిక్స్ చేశారు. ఇట్లాంటి గబ్బు పాలకవర్గాన్ని నేనెప్పుడూ చూడలేదు.

**అజీజ్ :** నీ పాలనే గబ్బు... నీ మనసే గబ్బు... గత 20ఏళ్లుగా మున్సిపాల్టీని అవినీతి మయంగా చేసింది నువ్వే... నీ అనుచరులకు నెల్లూరును ధారాదత్తం చేశావు. కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డావు. నీ అవినీతి గబ్బునంతా మేం శుద్ధి చేస్తున్నాం...

**నారద చైతన్య :** మీ మాటల్లో టెంపో లేదు, పౌరుషం లేదు. ఒకర్నొకరు ఇంత చప్పగా తింటుకుంటే ఇక మా ఛానెల్‌ను ఎవరు చూస్తారు. మీ ఒరిజినల్ పౌరుషం చూపండి...

**వివేకా :** అజీజ్... సింహంతో వేట ఆనంతో ఆటా వద్దు... నేను గట్టిగా తొడ చరిచానంటే ఆ సౌండ్‌కే జడుపు జ్వరం వస్తుంది నీకు!

**అజీజ్ :** వివేకా... నీ ఫ్లూట్ కుందేలు ముందు ఊదు, ఈ పులిముందు కాదు, కత్తులతో కాదు, నా కంటి చూపు చాలు... అడ్రస్ లేకుండా పోతావ్... నాతో పెట్టుకోవద్దు.

**వివేకా :** చూడు, ఒక వైపే చూడు, రెండో వైపు చూడాలనుకోవద్దు, తట్టుకోలేవ్, మాడి మసైపోతావ్...

**అజీజ్ :** నువ్వు మందితో వచ్చినా సరే, సింగిల్‌గా వచ్చినా సరే... టైం నువ్వు చెప్పినా సరే, నన్ను చెప్పమన్నా సరే, డేట్ నువ్వు చెప్పినా సరే, నన్ను చెప్పమన్నా సరే, ప్లేస్ నువ్వు చెప్పినా సరే నన్ను చెప్పమన్నా సరే.. ఒక్కడినే వస్తా, వంద మందితో రా, వందకు వంద పెంచుకుంటూ రా... ఒంటిచేత్తో మట్టి కరిపించకపోతే నా పేరు అజీజే కాదు...

**వివేకా :** రజనీకాంత్ లెవల్లో నవ్వుతూ... చిన్నా, గేదెలు, గొర్రెలే గుంపులుగా వస్తాయ్, సింహమెప్పుడూ సింగిల్‌గానే వస్తుంది... అని డైలాగ్ వదిలాడు.

అప్పుడు నారద చైతన్య మనసులో వీళ్లను ఇలా వదిలేస్తే మాటలతోనే సరిపెట్టేటట్లున్నారనుకుని... మీ డేట్ నేను ఫిక్స్ చేస్తాను, రేపు జూలై 1వ తేదీ నెల్లూరు, ఏ.సి. స్టేడియంలో మీ ఇరువర్గాలకు డిబేట్ పెడతాం, ఎవరు అవినీతి ఎంతో అక్కడ నిరూపించుకోండి అని చెప్పాడు. దానికి వివేకా రౌద్రంగా లేచి నేను సై అంటే... అజీజ్ కూడా నేనూ సై అంటూ ఆవేశంగా లేచాడు.

టీవీలో అదంతా చూసిన చంద్రబాబు నారాయణ వైపు కోపంగా చూస్తూ... నువ్వే కదా వీళ్లిద్దరినీ పార్టీలోకి తీసుకొచ్చింది. ఎంతో ప్రశాంతంగా వున్న పార్టీలోకి యుద్ధోన్మాదులను తీసుకొచ్చావ్. జూలై 1వ తేదీ ఏ.సి స్టేడియంలో ఈ రెండు వర్గాలు పోగైతే పెద్ద ఎత్తున రక్తపాతం జరగొచ్చు. వీళ్ల మధ్య గొడవ లేకుండా ఎలాగైనా రాజీ కుదుర్చు అని చెప్పాడు. నారాయణ గడ గడ వణుకుతూ... నా పాటికి నేను కాలేజీలు నడుపుకుంటూ ప్రశాంతంగా ఉన్నాను, నన్ను రాజకీయాల్లోకి తెచ్చింది మీరే, వాళ్ల మాటలు వింటుంటేనే నాకు జ్వరమొచ్చింది, ఇక వాళ్లను ఆపడం నా వల్ల ఎక్కడవుతుంది, చూస్తూ చూస్తూ నన్ను పులుల బోనులో దూరమంటారా, మీకు కొంచెం కూడా జాలి, దయ, మానవత్వం లేదా అని నిష్టూరపడ్డాడు. చంద్రబాబు వెంటనే కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుకు ఫోన్ చేసి... నెల్లూరు పరిస్థితిని వివరించి మీరే జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని కోరాడు. దానికి వెంకయ్య... నేనిప్పుడు రాజస్థాన్ ముద్దుబిడ్డను, ఇక్కడ సమస్యలేవన్నా వుంటే చెప్పండంటూ ఫోన్ పెట్టేసాడు. అందరూ నెల్లూరు నేతల దెబ్బకు భయపడుతుండేసరికి చంద్రబాబు ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి బాన్‌కీమూన్‌కి ఫోన్ చేశాడు. నెల్లూరులో పరిస్థితిని వివరించి... ఐక్య రాజ్యసమితి శాంతి దళాన్ని నెల్లూరుకు పంపించాలని కోరాడు. అందుకు ఆయన అంగీకరించాడు. అలాగే చంద్రబాబు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌కు ఫోన్ చేసి నెల్లూరుకు ప్రత్యేక బలగాలను పంపించమని కోరాడు.

★★★★★

జూలై 1వ తేదీ... జాతీయ, అంతర్జాతీయ టీవీ ఛానెల్స్ అన్నీ ప్రత్యక్షప్రసార వ్యాన్‌లతో ఏసి స్టేడియంలో వున్నాయి. పుకార్ 1+1=11/666 ఛానెల్ యాంకర్ నారదచైతన్య పెద్దటీమ్‌తో వచ్చి పళ్లు తోముకోవడం దగ్గర నుండి అన్నీ అక్కడే చేస్తున్నాడు. సిఆర్‌పిఎఫ్, ఐటిబి, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ దళాలు అక్కడ పహారా కాస్తున్నాయి. ఘర్షణలు జరిగితే క్షతగాత్రులను తీసుకెళ్లడానికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లు, ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి పంపిన శాంతి దళం ఎలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా వుంది... అందరూ అలా నిరీక్షిస్తున్నారు. ఛానెల్స్ అన్నీ కూడా ఇతర కార్యక్రమాలను నిలిపేసి కేవలం ఏసి స్టేడియంనే చూపిస్తూ... మీ గుండెలను గట్టిగా పట్టుకోండి... హార్ట్ కంప్లైంట్స్ ఉండేవాళ్లు ఈ సీన్‌లు చూడొద్దు... ఇక కొద్దిసేపట్లోనే ఇక్కడ ఆనం – అజీజ్‌ల మధ్య అరివీర భయంకర యుద్ధం చూడబోతున్నారంటూ వూరిస్తున్నాయి. నారద చైతన్య తన ఛానెల్ స్టూడియోకు లైవ్‌లో మాట్లాడుతున్నాడు. అవతల స్టూడియోలో వున్న జఫ్నారాణి... నారదా, అక్కడ పరిస్థితి ఎలా వుంది, కేవలం గాయాలతో పోతుందా... శాల్తీలు లేసే ఛాన్స్ ఏమైనా వుందా? ఉంటే ఎంతమందిని లెక్కేసుకోవచ్చు... అని అడిగింది. దానికి నారద, జఫ్నా... ఇక్కడ పరిస్థితిని ఇంటలిజెన్స్ వాళ్లు కూడా అంచనా వేయలేకపోతున్నారు. ఇప్పటికైతే తుఫాన్ ముందటి ప్రశాంతత నెలకొంది. ఏ క్షణమైనా సునామీ రావచ్చు. రక్తం వరదలై పారొచ్చు. మీరు మాత్రం ఇంటికెళ్లకుండా స్టూడియోలోనే ఉండండి అని కట్ చేశాడు. అలా సాయంత్రమైంది... నారదచైతన్యకు ఎందుకో అనుమానం వచ్చింది, ఆనం, అజీజ్‌లు ఈ డేట్ ఏమన్నా మరచిపోయారా... ఉదయం 10గంటలకు అని నేను చెబితే, వాళ్లేమన్నా రాత్రి 10గంటలకు అనుకున్నారా... అనే డౌట్ వచ్చింది. ఎందుకైనా మంచిది ఒకసారి గుర్తు చేస్తే పోలా అనుకుంటూ వివేకా సెల్‌కు ఫోన్ చేసి... మీరెక్కడున్నారని అడిగాడు. దానికి వివేకా... ఇక్కడ హరనాథపురంలో వున్నాను. నా బెస్ట్ ఫ్రెండ్ మేయర్ అజీజ్ ఇఫ్తార్ విందు ఇస్తుంటే వచ్చాను, నాతో ఏదైనా పని వుందా అని అడిగాడు. ఈ మాట వినేలోపే నారదచైతన్య కళ్లు తిరిగి క్రిందపడిపోయాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో సామాన్య వృద్ధి, సామాన్య ఆదాయం ఉంటుంది. అష్టమశని కారణం ఖర్చులు మనస్పర్థలు ఎక్కువుగా ఉంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు వచ్చినను పట్టుదలతో సాధిస్తారు. వ్యవహారాలను సామరస్యంగా నడపండి. ఒక్కొక్కసారి ఇతరులను బాధపెట్టే పరిస్థితి మీకుంటుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో పొరపాట్లు జరిపే దుస్థితి ఉంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపారవర్గాలకు పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. ఋణాలు వ్యాపారులకు, నిర్మాణాలకు లభిస్తాయి. ఆర్థికంగా బాగానే ఉంటుంది. మీ పరిధి సభ్యులతో తగాదాలు పెట్టడానికి, సమస్యలు కలిగించడానికి ప్రయత్నాలుంటాయి. వృత్తి ఉపాధి పథకాల వారికి సామాన్య ఆదాయం. ఉన్నత విద్యావకాశాలు లభించడం ఉంటుంది. ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఋణాలు చేయవలసి రావచ్చును. అనుకున్న పనులు సరిగా జరుగవు. యజమానులకు వర్కర్లతో సమస్యలు ఏర్పడవచ్చును. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. వాణిజ్యాభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబంతో బంధువులతో విభేదాలు రాకుండా జాగ్రత్త పడాలి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. మానసిక ప్రశాంతత అలవాటు చేసుకొనండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తులు కొనే ఆలోచనలకు అనుకూలత బాగుంది. నిర్మాణాలు, రిపేర్లు నిదానంగా సాగుతాయి. మౌలిక వ్యవహారాలలోను, ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. మీ పనులకు ప్రోత్సాహం బాగుంటుంది. సన్మానాలు, గౌరవాదరణలుంటాయి. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకోని అదనపు ఆదాయం, నూతన వస్తువులు సమకూరడం ఉంటుంది. మిమ్మల్ని వ్యతిరేకించే వారు కూడా రాజీకి వస్తారు. వృత్తి ఉపాధి పథకాలలో రాణిస్తారు. వ్యాపారాలు సంతృప్తికరంగా ఉంటాయి. కొత్త పరిచయాలుంటాయి. చేపట్టిన పనులందు టెన్షన్ ఉండినా సవ్యంగానే సాగుతాయి. శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. కుటుంబసౌఖ్యం కలదు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బిడ్డల యొక్క శుభకార్యాలు, చదువులపై దృష్టి పెడతారు. సమస్యలలోనికి లాగడానికి ఇతరుల కవ్వింపులుంటాయి. అనుకున్న పనులు సరిగా జరగవు. ఉద్యోగార్థులకు అవకాశాలుంటాయి. ప్రయాణ శ్రమ ఉంటుంది. విచ్చలవిడిగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన స్థితి ఉండదు. కోర్టు కేసులు వాయిదా పడతాయి. అవసరాలకు ఋణాలు చేస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 1.7.2016 నుండి
తేది. 7.7.2016 వరకు

ఈ వారము వృషభ మిథున కర్కాటక రాశులలో చంద్రుడు, మిథునంలో రవిబుధ శుక్రులు, సింహంలో గురు రాహువులు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

**జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.10.57వ॥ |
| తేది. 2 | శని | త్రయోదశి | రా॥ గం.8.47వ॥ |
| తేది. 3 | ఆది | చతుర్దశి | రా॥ గం.6.41వ॥ |
| తేది. 4 | సోమ | అమావాస్య | సా॥ గం.4.31వ॥ |

**ఆషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 5 | మంగళ | పాడ్యమి | సా॥ గం.3.35వ॥ |
| తేది. 6 | బుధ | విదియ | సా॥ గం.2.38వ॥ |
| తేది. 7 | గురు | తదియ | సా॥ గం.2.08వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇంట్లో వ్యక్తులతో అనుకూలత తక్కువ బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. ఆర్థికంగా ఇబ్బందులుండగలవు. వృత్తి వ్యాపారాలలో సంపాదన సరిగా ఉండదు. కుటుంబఖర్చులు బాగా పెరుగుతాయి. ఉద్యోగులు తమ పైఅధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా ఉండండి. తొందరపాటు చర్యలు మాటలు పలకకుండా జాగ్రత్తపడండి. కీలక సమావేశాలలో పాల్గొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో రాణించగలరు. ఉద్యోగులకు మంచి గుర్తింపు అధికారులకు స్థానమార్పులుంటాయి. శుభకార్య ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత ఉంది. శాస్త్ర సాంకేతిక క్రీడా రంగాలలో మంచి ఫలితాలు సాధిస్తారు. కొత్త విద్యా కోర్సులు లభిస్తాయి. సమయోచిత నిర్ణయాల వల్ల ప్రయోజనం పొందుతారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు అసంతృప్తినే కలిగిస్తాయి. ఇంటి రిపేర్లు, వస్తువాహన రిపేర్లుంటాయి. అనవసరమైన ఖర్చులు, అదనపు ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. చేపట్టిన పనులకు ఆటంకాలుండినా సానుకూలం కాగలవు. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్త అవసరం. ఆస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులు వాయిదా వేసుకుంటే మంచిది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బిడ్డల విద్యా, వివాహాది విషయాలలో శ్రద్ధ చూపెడతారు. సభలు సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. స్టాకిస్టులకు, హోల్‌సేల్ వ్యాపారులకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలవృద్ధి, ఆదాయం సంతృప్తికరం. బంధువర్గంతో వ్యవహారాలు, మనస్పర్థలు లేకుండా చూచుకొనండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బందిపడరు. చిన్న వ్యాపారులు, వృత్తి పనివారికి ఆదాయం ఆర్థిక స్థితి బాగుంటుంది. ఆటంకాల వల్ల టెన్షన్ ఉండినా చేయదలచిన పనులు పూర్తి చేస్తారు. కొత్త పరిచయాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభిస్తాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభించగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడవచ్చును. పెండింగ్‌లో పడియున్న పనులు మరల కొనసాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు, ఇంటర్వ్యూలు అందుతాయి. ఆర్థిక నిర్ణయాలందు గాని వ్యవహారాలందు గాని ఇతరుల సలహాలు పొందడం మంచిది. ఆరోగ్యం బాగానే వుంటుంది.



జూన్ 30వ తేదీన జిల్లా పోలీస్‌శాఖలో పదవీ విరమణ చేస్తున్న అధికారులను, సిబ్బందిని బుధవారం నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కరించిన జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, ఏఎస్పీ శరత్‌బాబు మరియు జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు.

# మైనార్టీల అభ్యున్నతికి కృషి

## - ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్ధా



ఇఫ్తార్ విందులో పాల్గొన్న శిద్ధా రాఘవరావు, సోమిరెడ్డి, బీద, అజీజ్, ముంగమూరు

రాష్ట్రంలో మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు పేర్కొన్నారు. జూన్ 27వ తేదీన నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి గత ప్రభుత్వం 350కోట్ల రూపాయలు కేటాయించగా తెలుగుదేశం ప్రభుత్వం 750కోట్లు కేటాయించిందన్నారు. ఈ రంజాన్‌కు తెల్లరేషన్‌కార్డు వున్న ప్రతి ముస్లిం కుటుంబానికి రంజాన్ తోఫా క్రింద 5కిలోల గోధుమపిండి, 2కిలోల చక్కెర, కిలో సేమియా, వంద గ్రాముల నెయ్యిని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ, కడపలలో హజ్‌హౌస్‌లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ యం.జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, ఎస్పీ విశాల్‌గున్నీ, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, నగర కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అందరూ ఇఫ్తార్‌విందు ఆరగించారు.

# రోటరీ క్లబ్ అధ్యక్షునిగా విజయరామిరెడ్డి




మెరిట్ విద్యార్థులతో రోటరీ కొత్త కార్యవర్గ సభ్యులు

నెల్లూరు ఆర్టీసీ బస్టాండు ప్రక్కన గల రోటరీ ఆడిటోరియంలో మంగళవారం రాత్రి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షునిగా విజయరామిరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులుతో క్లబ్ గవర్నర్ డా॥ దామోదర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ సేవలు విస్తృతం చేసేందుకు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిటి కృషి చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రోటరీ సంస్థ రూ.6వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అనంతరం పేద విద్యార్థులకు, వివిధ పాఠశాలల్లోని మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషికం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి.దొరస్వామి నాయుడు(సర్వీస్ ప్రాజెక్ట్), వై.జగన్నాథం(క్లబ్ అడ్మినిస్ట్రేషన్), కొండా శేఖర్‌రెడ్డి(మెంబర్‌షిప్ డెవలప్‌మెంట్), ఎస్.రాఘవేంద్రషెట్టి(ఫౌండేషన్ ప్రాజెక్ట్), సి.వెంకటేశ్వర్లు(పౌరసంబంధాలు), వివిధ విభాగాల డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. మాజీగవర్నర్లు భరత్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ముని గిరీష్, అసిస్టెంట్ గవర్నర్ ధనుంజయరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు కె.ప్రతాప్‌కుమార్, ఐ ఫౌండేషన్ ఛైర్మెన్ కొట్టే మధుసూదన్‌రావు, మాజీ ఛైర్మెన్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, కొండా బలరామిరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నెల్లూరు జేసీస్ సేవలు అభినందనీయం




వెంకటనారాయణ్ దంపతులను సత్కరిస్తున్న జేసీస్ సభ్యులు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని జేసీస్ భవన్‌లో ఆదివారం జేసీస్ రీజినల్ సదస్సు జరిగింది. జేసీస్ జోనల్ వైస్‌ప్రెసిడెంట్ వెంకటనారాయణ్ వేదాంత్ రాహుల్ ముఖ్యఅతిథిగా పాల్గొని నెల్లూరు జేసీస్ అందిస్తున్న సేవలను కొనియాడారు. నెల్లూరు జేసీస్ అధ్యక్షుడు బి.ఇ.మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ డైరెక్టర్ సి.హెచ్. శరణ్‌కుమార్, జేసీస్ సభ్యులు ఎన్.వి.మహేష్, కె.చరణ్‌కుమార్, బి.జనార్ధన్, సి.ఉమారజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ్ వేదాంత్ రాహుల్ దంపతులను జేసీస్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

# ఋణమాఫీ పెద్ద డ్రామా!




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఋణమాఫీ పెద్దడ్రామాగా మారిందని, రైతులను నిలువునా మోసం చేస్తుందని వైకాపా జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రైతు ఋణ ఉపశమన పత్రాలంటూ తెలుగుదేశం నాయకులు ఆర్భాటంగా ఇస్తున్న పత్రాలను, బాండ్లను బ్యాంకుల వాళ్లు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. రైతుల అకౌంట్‌లో ఒక్కసారి వేసిన నగదును రెండుసార్లు వేసినట్లుగా చూపిస్తున్నారని ఆయన విమర్శించారు. గత వరదలలో తీవ్రంగా నష్టపోయిన ఆక్వా రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. చైనా పర్యటనలో వున్న చంద్రబాబు కుదిర్చిన పరిశ్రమల ఒప్పందాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. కాకినాడ నుండి చెన్నైకు గ్యాస్ పైప్‌లైన్‌పై ఇంకా స్పష్టత రాలేదు. మరి కృష్ణపట్నంలో గ్యాస్ ఆధారిత చైనా ఎరువుల ఫ్యాక్టరీని ఎలా నిర్మిస్తారని ఆయన ప్రశ్నించాడు. కృష్ణపట్నం వద్ద ఖాళీగా వున్న రిలయన్స్ భూములను కాజేసే పన్నాగంతోనే ఈ చైనా పరిశ్రమను తెరమీదకు తెచ్చినట్లుగా కనిపిస్తుందన్నారు. ఈ మాత్రం గ్యాస్ ఇస్తే ఇంకా చౌకగా మన దేశానికి చెందిన ఇఫ్‌కో, క్రిబ్‌కో సంస్థలే అక్కడ ఎరువుల ఫ్యాక్టరీలు పెడతాయని ఆయన పేర్కొన్నాడు.

# డాక్టర్ భక్తవత్సలరెడ్డికి జాతీయ పురస్కారం




డాక్టర్ భక్తవత్సలరెడ్డికి అవార్డు ప్రదానం

నెల్లూరులోని సింహపురి హాస్పిటల్స్ గుండె వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డికి జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ముంబయిలోని తాజ్‌లాండ్స్ ఎండ్ హోటల్‌లో సిఎంవో ఆసియా సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో గుండె వైద్య రంగానికి సంబంధించి డాక్టర్ భక్తవత్సలరెడ్డి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. గుండెజబ్బుల వైద్యంలో అవలంభిస్తున్న వినూత్న ప్రక్రియలకుగాను లావోస్ విద్య, క్రీడల మంత్రి హెచ్‌ఈ లిటావు బౌపావు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత చిర్రా భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ జాతీయ అవార్డు అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని, పురస్కారాలు తమ బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆర్‌జిఎఫ్ మేనేజ్‌మెంట్ సెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌ముట్టల్ పాల్గొన్నారు.

# గూడూరులో స్టేట్‌బ్యాంక్ డే




మొక్కలు నాటుతున్న ఎస్‌బిఐ సిబ్బంది

గూడూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డే సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విందూరు గ్రామంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ ప్రతి బ్రాంచ్ బ్యాంక్‌డే ముందు కనీసం 100 మొక్కలు నాటడం జరుగుతుంది. జూలై 1వ తేదీన బ్యాంక్‌డేను ప్రతి సంవత్సరం జరుపుకుంటామని స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ వై.మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ గూడూరు శాఖ చీఫ్ బ్రాంచ్ మేనేజర్ వై.మురళీకృష్ణ, పిబిడి మేనేజర్ సోమేశ్వరరావు, అకౌంటెంట్ రమణయ్య, హెడ్‌మాస్టర్ ఇస్మాయిల్, విందూరు సర్పంచ్ మల్లిఖార్జునరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బొమ్మిరెడ్డి పద్మ, స్టేట్‌బ్యాంక్ గూడూరు శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో మహిళల అభివృద్ధి



శిక్షణ పొందిన మహిళలతో వసంత లక్ష్మి

మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంత లక్ష్మి పేర్కొన్నారు. మెప్మా, ఐకెపి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో, వసంత లక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో మూడు నెలల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నెల్లూరు గాంధీనగర్, విఎంఆర్ నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా టైలరింగ్ పూర్తి చేసుకున్న మహిళలందరూ కలిసి ఒక యూనిట్‌గా ఏర్పడ్డారు. మెప్మా కో-ఆర్డినేటర్ అంకయ్య మాట్లాడుతూ మహిళలు సాధికారత దిశగా మెళకువలు, ప్రతిభను పెంపొందించుకోవాలని, ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు.

# ఇంటర్నేషనల్ వాకర్స్ కార్యవర్గ సమావేశం



నెల్లూరు పొదలకూరు రోడ్డు, జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో గత నెల 26వ తేదీన జడ్పీ వాకర్స్ కార్యవర్గ సమావేశం చలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షురాలు ఎస్.కృష్ణకుమారి, తుంగా నారాయణరెడ్డి పాల్గొన్నారు. తొలుత సంఘ ఉపాధ్యక్షుడు టి.వి.రమణయ్య ప్రార్థనాగీతం ఆలపించారు. సంఘ ప్రధానకార్యదర్శి జెఎస్ఆర్ ఆంజనేయులు సంఘ కార్యకలాపాల నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా గొల్లపాళెం శరత్‌బాబు అనాథ పాఠశాలకు చలంచర్ల భాస్కర్‌రెడ్డి రూ.7116లు విరాళాన్ని కృష్ణకుమారి చేతుల మీదుగా అందజేశారు. అలాగే నలుగురు అనాథ విద్యార్థులకు రూ.500 చొప్పున, ఇరువురు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చెలికాని సీతారామయ్య, వి.మురళీ మోహన్‌రావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎస్.మనోహర్‌రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం అతిథులందరిని సత్కరించారు. జడ్పీ వాకర్స్ సభ్యులు చేస్తున్న సంఘ కార్యకలాపాలను కృష్ణకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్ మండవ శ్రీనివాసరావు, సంఘ సలహాదార్లు బిరుదవోలు రామిరెడ్డి, యం.వి. కృష్ణయ్య, శ్రీధర్, వి.ఎస్.ప్రసాద్, ఎం.సుధాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నంలో చైనా ప్లాంట్

## • 10,182 కోట్లతో గ్యాస్ ఆధారిత ఎరువుల పరిశ్రమ

ఎట్టకేలకు చైనా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మన జిల్లాలో ఓ భారీ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. 10,183 కోట్ల రూపాయల భారీ వ్యయంతో, కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో గ్యాస్ ఆధారిత ఎరువుల పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. చైనాకు చెందిన హాంక్విన్ కాంట్రాక్టింగ్ అండ్ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (హెచ్‌క్యూసి)తో ఆ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం చైనాలోని బీజింగ్‌లో వుంది. ఆ దేశంలోని నేషనల్ పెట్రోలియం కార్పొరేషన్‌కు ఇది అనుబంధ సంస్థ కూడా. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చైనాకు వెళ్లి అక్కడ 30మంది పెట్టుబడిదారులతో సమావేశమైన సందర్భంగా కృష్ణపట్నం ప్లాంట్‌ను ఖరారు చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సమకూరుతాయని అంచనా వేస్తున్నారు. ఒక్క కృష్ణపట్నంలోనే కాక, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు చేపట్టిన ముఖ్యమంత్రి చైనా పర్యటన విజయవంతం కావడం విశేషం. నెల్లూరుజిల్లా సముద్రతీరంలో ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్ట్ సెజ్‌కు చైనా కంపెనీ రానుండడంతో ఇక విదేశీ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి రావడానికి శ్రీకారం జరిగినట్లేనని అనుకోవచ్చు. బహుశా రానున్న రెండేళ్లలోనే చైనా వారి ఎరువుల పరిశ్రమ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, ఆ పరిశ్రమ ద్వారా 5వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే వెంకటాచలం వద్ద క్రిభ్‌కో యూరియా పరిశ్రమ ఏర్పాటవుతోంది. ఇక్కడున్న పలు థర్మల్ విద్యుత్ కేంద్రాలు విద్యుదుత్పత్తిని కూడా ప్రారంభించాయి. కంటెనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్) సంస్థ సుమారు రెండువందల కోట్లతో కార్గో సేవలను విస్తృతపరిచేందుకు అంగీకరించి వుండగా, ఇప్పుడు తాజాగా చైనా సంస్థ కూడా ఇక్కడ భారీ కర్మాగారం ఏర్పాటుకు ముందుకు రావడంతో పారిశ్రామికంగా కృష్ణపట్నంకు మహర్దశ పట్టవచ్చని అందరూ భావిస్తున్నారు. అయితే ఇంతవరకు నెల్లూరుకు గ్యాస్ పైప్‌లైన్ లేదు. అదొస్తేగాని ఈ చైనా ప్లాంట్‌ను నమ్మలేము. పైప్ లైన్ రావాలంటే పెద్ద పనే! మరి ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమౌతుందో?

# కేసుల్లో 'బూదాటి'



నెల్లూరుజిల్లాకు చెందిన మాజీశాసనమండలి సభ్యులు బూదాటి రాధాకృష్ణయ్య అక్రమ మద్యం కేసులో అరెస్ట్ కాబడ్డారు. విదేశాల నుండి ఆయన పెద్దఎత్తున వోడ్కా మద్యం నిల్వలను తెచ్చి హైదరాబాద్‌లోని తన ఇంట్లో దాచిపెట్టాడు. ఎక్సైజ్ అధికారుల దాడుల్లో ఈ అక్రమ మద్యం బయటపడింది. అలాగే విజయనగరం జిల్లాలోని పలువురికి ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి లక్షల రూపాయలు వసూలు చేసి నిరుద్యోగులను మోసం చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా చేసిన వ్యక్తికి ఇదేం పాడుబుద్ధో!

# అమరావతివైపు అడుగులు!

(మొదటి పేజీ తరువాయి)

తగ్గాయి. అప్పటి నుండే అమరావతిపై ఆయన దృష్టి పెట్టాడు. తాను పూర్తి స్థాయిలో విజయవాడలో ఉంటుండడంతో ఏపి పరిపాలనను సైతం త్వరగా అమరావతికి మార్పించడానికి చర్యలు చేపట్టాడు. ఈ పరంపరలోనే వెలగపూడిలో యుద్ధప్రాతిపదికన తాత్కాలిక సచివాలయాన్ని సిద్ధం చేయించాడు. అదరాబదరా పనులు చేయించాడు. ఇక విజయవాడ, గుంటూరులలో పలు శాఖలకు అద్దెభవనాలు తీసుకున్నారు. హైదరాబాద్ నుండి ఉద్యోగులు వచ్చి ఇక్కడ కార్యాలయాల నుండే విధులు నిర్వహిస్తున్నారు. ఏపిఎస్ఆర్టీసీ ఉద్యోగులు కూడా విజయవాడ బస్‌స్టేషన్‌లో కట్టిన కొత్త భవనంలోకి మారిపోయారు. ఇక జూన్ 29వ తేదీ వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయాన్ని మంత్రులు ప్రారంభించారు. తాత్కాలిక రాజధానికి విజయవాడ, గుంటూరుల నుండి ప్రత్యేకబస్సులు నడుపుతున్నారు. అలాగే హైదరాబాదు నుండి వచ్చే ఉద్యోగుల కోసం స్పెషల్ ట్రైన్ కూడా నడుపుతున్నారు. సిటీ నుండి బదిలీయై పల్లెటూర్లో పడ్డట్లుయ్యింది ఏ.పి. ఉద్యోగుల పరిస్థితి. అయినా ఇది మన ఇల్లు, మన ఊరు. రాష్ట్ర విభజన రోజునే హైదరాబాద్ ఇక మనది కాదు అని తేలిపోయింది. ఇప్పుడు మనకు చెన్నై, బెంగుళూరుసిటీలు ఎలాగో, హైదరాబాద్ కూడా అలాగే! మనం ఇంక ఎంతకాలం అక్కడ వున్నా ఆ నగరాన్ని అభివృద్ధి చేయడం తప్పితే, దాని నుండి మనం పొందేది ఏమీ ఉండదు. ఈరోజు అమరావతి హైదరాబాద్ లాగా ఉండకపోవచ్చు. అన్నీ సౌకర్యాలు ఉండవు. ఆరంభంలో అగచాట్లు తప్పవు. రాజధాని విషయంలో మనం జీరో స్టేజ్ నుండి పరుగు మొదలుపెట్టాం. అందరూ కలిసి శ్రమిస్తే అమరావతిని హైదరాబాద్ స్థాయికి తీసుకెళ్లడం సాధ్యం కాకుండా పోదు. ఆ దిశగా కలిసి నడుద్దాం.

## మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు జ్ఞాపికలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసి ఇంతియాజ్, పక్కన ఎమ్మెల్యే సునీల్, రియాజ్ అహ్మద్

మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు షాదీమంజిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చదువుకు పేదరికం ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకాకూడదని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు పేదరికం అడ్డుకాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఒడిదుడుకులు ఎదురైనా అందరూ చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ జానకి సామాన్య కుటుంబం నుంచి వచ్చి నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్వయంశక్తితో ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. చంద్రన్న బీమా పథకం కింద విద్యార్థులకు సాయం అందజేస్తానని ప్రకటించారు. అనంతరం పదోతరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు, దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐవో ఇస్మాయిల్, నెట్‌వర్క్ అధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్, మహబూబ్ బాషా, గౌస్‌మొహిద్దీన్, రహీం, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# వీధికెక్కిన న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కాని రాజ్యాంగం, చట్టాలు తెలిసిన న్యాయమూర్తులకేమైంది. వారికి కనీస ధర్మం తెలియదా? న్యాయవ్యవస్థను నవ్వులపాలు చేసిన 11మంది న్యాయమూర్తులపై హైకోర్టు చర్యలు తీసుకోవడం సమంజసమైన నిర్ణయం. అలాగే మూకుమ్మడిగా సెలవులు పెట్టాలన్న తెలంగాణ న్యాయాధికారుల ఆటలు సాగనివ్వకుండా వారికి సెలవులు మంజూరు చేసే అధికారాన్ని హైకోర్టు తన పరిధిలోకి తీసుకుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి సదానందగౌడ కూడా తెలంగాణ సీఎం కేసీఆర్‌ను ఘాటుగానే హెచ్చరించాడు. హైకోర్టు విభజనను రెండు రాష్ట్రాలు కలిసి పరిష్కరించుకోవాలని, చీటికి మాటికి అరవింద్ కేజ్రీవాల్ మాదిరిగా రోడ్డెక్కొద్దని ఆయన పేర్కొనడం, కేసీఆర్‌కు పెద్ద మొట్టికాయే! ఏదేమైనా తెలంగాణ న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ పరువు తీశారు. నల్లకోటుకున్న గౌరవ మర్యాదలను మంటగలిపారు.

# కాలధర్మం

## పాపకన్ను పెద్దచిన్నమ్మ



స్వర్గీయ పాపకన్ను వెంకట్రామిరెడ్డి సతీమణి పాపకన్ను పెద్దచిన్నమ్మ జూన్ 27వ తేదీ స్వర్గస్తురాలైనారు. ఆమె వయసు 94సంవత్సరాలు. 28వ తేదీ స్వగ్రామమైన రావూరు మండలం వేపినాపిలో అంత్యక్రియలు జరిగాయి. పెద్దచిన్నమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారులు స్వర్గీయ పాపకన్ను జయచంద్రారెడ్డి రాపూరు మాజీ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి, దశరథరామిరెడ్డిలు జిల్లా వాసులకు సుపరిచితులే! నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అల్లుడవుతాడు. పెద్దచిన్నమ్మ చిన్నకూతురు మణిమంజరినే రాజమోహన్‌రెడ్డి వివాహమాడాడు. పెద్దచిన్నమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# కేంద్రీయ విద్యాలయంలో అదనంగా సీట్లు

నెల్లూరుజిల్లాకు ప్రతిష్టాత్మకంగా కొత్తూరు వద్ద ఏర్పాటు చేసిన నెల్లూరు కేంద్రీయ విద్యాలయంలో 2016-17విద్యాసంవత్సరానికి అదనంగా సీట్లు పెంచుతూ కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం 1నుంచి 8వ తరగతి వరకు సీట్లు పెరిగాయి. ప్రతి తరగతికి 30 నుంచి 40వరకు పెరిగినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నుంచి జూలై 18వతేదీ వరకు అడ్మిషన్లకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడుగంటల లోపు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, ప్రభుత్వ నియమాలను అనుసరించి మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర నియమాల ప్రకారం రిజర్వేషన్ ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం స్కూల్ వెబ్‌సైట్ www.kvnellore.ac.inలో పరిశీలించవచ్చని, స్కూల్‌లోని నోటీసు బోర్డులో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు ఉపయోగించుకోవాలని కోరారు.

# ఫ్లెక్సీ

- చిన్ని నారాయణరావు
94402 02942

వాడు క్షణంలోనే
ఫ్లెక్సీగా మారి
ఊరు వాడంతా
సందడి చేస్తాడు
కొంపలు కూల్చిన మ్లేచ్ఛుణ్ణి
దేవుని స్వరూపమంటాడు
భూములు మింగిన బకాసురుణ్ణి
ప్రజానాయక రూపమంటాడు
మరణమృదంగం విన్పించిన నేరగాణ్ణి
మహానాయకుడిగా కీర్తిస్తాడు
పదిమంది ఫోటోలు పెట్టి
ఫ్లెక్సీల పల్లకీలు మోస్తాడు
ఏ భుజకీర్తుల సిరుల
వేట కోసమో ఏమో గాని
వీధివీధంతా వాడి భావాల
కంపుతో -
ముక్కుపుటాలెగిరిపోతాయి
వాడి చేష్టల రసాయినాల
వాసనలతో...
రాష్ట్రాలన్నీ వెర్రెక్కిపోతాయి
వాడు మాత్రం తారాజువ్వలా
వెలిగిపోతాడు
జనం నెత్తిన టోపీ పెట్టి
నాయకుడంటూ బాకా ఊది
కాకాపట్టి -
తాను విజయకేతనమవుతాడు
ఫ్లెక్సీ మహమ్మారి
బ్రతుకుల్ని బజారుకీడుస్తుంది.

## కట్టేటప్పుడు కళ్లు మూసుకుని...

# కట్టాక కన్నెర్ర జేసి...



● టాస్క్‌ఫోర్స్ లాభమేంటి?

***అధికారుల పనితీరు భలే ఆశ్చర్యంగా ఉంటుంది. అక్రమాలకు సహకరించేదీ వీళ్లే... అక్రమాలను సహించేది లేదంటూ కన్నెర్రజేసేదీ వాళ్ళే! అక్రమాలను ఆదిలోనే అరికడితే వాటి వల్ల ఎవరికీ పెద్ద నష్టం ఉండదు కదా!***

నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాలను పరిశీలించి, అనుమతి లేకుండా కట్టిన భవనాలను గుర్తించి, వాటిని కూల్చేందుకంటూ రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ రఘు ఆధ్వర్యంలో పెద్ద బృందమే నెల్లూరొచ్చి హడావిడి చేయడం జరిగింది. సోమ, మంగళవారాలలో వీళ్లు ఆరు బృందాలుగా ఏర్పడి నగరంలోని 54 డివిజన్‌లలో భవనాల కొలతలు తీసి దాదాపు 200కుపైగా అనుమతికి విరుద్ధంగా కడుతున్న భవనాలను గుర్తించారు. వీటిలో కొన్నింటిని పగలగొట్టారు. మరికొన్నింటిని కూల్చబోగా స్థానికులు అడ్డుకున్నారు. కొందరైతే అట్రాసిటీ కేసులు పెడతామంటూ బెదిరించి వెళ్లగొట్టారు.

నగరంలో అక్రమ నిర్మాణాలు కొత్తేమీ కాదు. టౌన్‌ప్లానింగ్ నిబంధనలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే సగం నెల్లూరును కూలగొట్టాలి. నగరంలో అక్రమ నిర్మాణాలు పాలకులకు, అధికారులకు తెలియకుండా జరిగినవేమీ కాదు. పాలకుల అనుమతి తీసుకునే నిర్మాణం మొదలుపెడతారు. అధికారులు, సిబ్బంది కూడా వీళ్ల నుండి చిల్లర దండుకుని వుంటారు.

అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవడానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే బిఆర్ఎస్ స్కీంను అమలులోకి తెచ్చింది. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం కూడా దానిని అనుసరిస్తుంది. చాలామంది బిఆర్ఎస్ ఉందనే ధైర్యంతోనే ప్లాన్‌కు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

అసలు ఇంత సడెన్‌గా నెల్లూరులో టాస్క్‌ఫోర్స్ వ్యవహారమేంటన్నదానిపై కూడా చర్చ జరుగుతోంది. ఈమధ్య ఓ వ్యక్తి నుండి 50వేల లంచం తీసుకుంటూ ఏసిపి మునిరత్నం రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం, ఇందులో కమిషనర్‌కూ వాటా వుందని అతను చెప్పడం, ఆ తర్వాత కార్పొరేషన్‌లో నెలకొన్న అవినీతిపై ఆనం వివేకా, మేయర్ అజీజ్‌ల మధ్య మాటల యుద్ధం జరగడంతో... ఈ గబ్బు నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే, మున్సిపల్ మంత్రి నారాయణ నెల్లూరు కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై ఫైర్ అవుతున్నాడని, కఠిన చర్యలు తీసుకోబోతున్నాడని చెప్పేందుకే ఈ టాస్క్‌ఫోర్స్ వ్యవహారాన్ని నడుపుతున్నట్లుగా వుంది. టాస్క్‌ఫోర్స్ రెండు రోజులు తనిఖీలు చేస్తే నగరంలో పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. అక్రమంగా కట్టిన పెద్దపెద్ద వాణిజ్యభవనాలను వదిలేసి సన్నోళ్లు, చిన్నోళ్ల మీద పడతారా అంటూ ప్రతిపక్ష నాయకులూ ప్రశ్నించసాగారు. వివాదాలు, నిరసనలు రావడంతో తాత్కాలికంగా అక్రమ నిర్మాణాల తొలగింపును కూడా నిలిపేసారు.

కట్టిన వాటిని కూల్చేదానికన్నా కూడా కట్టకముందే నిలువరించడం సులభం. ప్లాన్‌లను సకాలంలో ఆమోదించి ఇస్తే అక్రమంగా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎవరికీ ఉండదు. ముందు కార్పొరేషన్‌లో వున్న లోటుపాట్లను సరిదిద్దితే నగరం దానంతట అదే బాగుపడుతుంది.

## కమిషనర్‌లకు కలిసిరాని నెల్లూరు!



గ్రహణమో, వరమో, శాపమోగాని కమిషనర్‌లుగా వచ్చిన వారెవరికీ నెల్లూరు నగర పాలక సంస్థ కలిసి రావడం లేదు. నీతిగా నిజాయితీగా పనిచేస్తే ఒక రూపంలో కష్టాలొస్తాయి. అవినీతి, అక్రమాలతో పనిచేస్తే మరో రూపంలో సమస్యలొస్తాయి. లౌక్యం, చాకచక్యం, సమయస్ఫూర్తి ఉన్నవాళ్లే ఇక్కడ కమిషనర్‌లుగా రాణించగలరు. అయితే ఒకే మనిషిలో ఇన్ని లక్షణాలు ఉండడం అరుదు. కాబట్టి ఏ కమిషనర్ కూడా ఇక్కడ నిలదొక్కుకోలేకపోతున్నారు. గత 20ఏళ్ల నెల్లూరు మున్సిపల్ చరిత్రను తీసుకుంటే గట్టిగా ఆరేళ్లపాటు పనిచేసిన ఒకే ఒక్క కమిషనర్‌గా టిఎస్ఆర్ ఆంజనేయులు కనిపిస్తాడు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కమిషనర్‌గా ఆయన లౌక్యంగా పనిచేస్తూ చాలా కాలమే ఇక్కడ నిలబడ్డాడు. అధికారపక్షం నాయకులే కాదు ప్రతిపక్ష నాయకులు కూడా తనను మెచ్చుకునేలా వ్యవహరించారు. గత 20ఏళ్లలో ఆంజనేయులు తప్పితే... మిగతా వాళ్లంతా ఇటొచ్చి అటు వెళ్లినవాళ్లే! నెల్లూరు కార్పొరేషన్‌లో ఏడాదిలోపు బదిలీ అయిన కమిషనర్‌ల సంఖ్య చాలానే వుంది. అంతెందుకు ఈ కొత్త పాలకవర్గం ఏర్పడ్డాకే నలుగురు కమిషనర్‌లు మారారు.

అవినీతి అక్రమాల ఆరోపణలతో కొందరు బదిలీ అయితే, రాజకీయ వివాదాల నేపథ్యంలో మరికొందరు బదిలీ కావడం జరిగింది. తాజా కమిషనర్ వెంకటేశ్వర్లు సైతం అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న నేపథ్యంలో ఇక్కడ ఈయన ఎంతకాలం ఉంటాడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

ఉత్తరక్రియలు



ఉత్తరక్రియలు:
తేది. 6-7-2016 బుధవారం ఆత్మకూరు, పంటవీధిలోని వారి స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

మాకు మార్గదర్శకురాలు, దైవసమానురాలు
శ్రీమతి కొల్లుకుదురు వనజాక్షమ్మ గారు
W/o. Late శంకరరెడ్డి గారు
తేది 22.06.16, బుధవారం స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కూతుళ్ళు - అల్లుళ్ళు
యేడం కామేశ్వరమ్మ - వెంకటశేషారెడ్డి
ఏకొల్లు శ్రీదేవమ్మ - లేట్ జయరామిరెడ్డి
ఏకొల్లు రామమ్మ - కోదండరామిరెడ్డి
కరేటి విజయ - రఘునందన్‌రెడ్డి
పోరెడ్డి అనురాధ - సుధాకర్‌రెడ్డి

కుమారులు - కోడళ్ళు
లేట్ కొల్లుకుదురు పరంధామరెడ్డి - రాజేశ్వరమ్మ
కొల్లుకుదురు ఆదినారాయణరెడ్డి - శైలజ
కొల్లుకుదురు వెంకటరమణారెడ్డి - శారద

మనుమళ్ళు - మనుమరాళ్ళు
కొల్లుకుదురు అశోక్‌రెడ్డి - హారిత
పద్మిని - సన్నపురెడ్డి మురళీకృష్ణారెడ్డి
రాధిక - అవిలాల గిరిధర్
సింధు - కొండూరు రాజేష్
కొల్లుకుదురు సాయికుమార్‌రెడ్డి - మనీష
కలికి భార్గవి - కలికి వెంకటకిషోర్‌రెడ్డి
యేడం శ్రీనివాసులురెడ్డి - వేదవతి
శ్యామల - సోమారెడ్డి జనార్ధన్‌రెడ్డి
ఏకొల్లు యుగంధర్‌రెడ్డి - అనూజ
ఏకొల్లు రామకృష్ణారెడ్డి - ప్రియాంక
ఏకొల్లు సంధ్య
కరేటి వివేక్‌రెడ్డి - రేణుక
కల్పన - దువ్వూరు ప్రసాద్‌రెడ్డి
పోరెడ్డి భరత్
పోరెడ్డి ప్రభాత్

మునిమనుమలు - మునిమనుమరాండ్రు
జ్ఞానసిరి
కీర్తన
నిశ్చల్
చరిత్ ప్రీతమ్
వెంకట ప్రతీక్
మానస - కొండూరు భీమేశ్వరరెడ్డి
మనోజ్
శ్రీతేజ - కొండూరు సుమన్
శ్రీపూజ - గడ్డం పెంచల్‌కుమార్
సాయి సాత్విక్
ధార్మిక్
ప్రాచీ పార్వతీ
హంసిని
మణికాంత్
శశాంక్

మునిమనుమరాళ్ళ పిల్లలు
సోహన్ రిషిక్
సాయి సంహిత

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com